చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



నేడు అమరావతికి సీఎం చంద్రబాబు
- ఆర్టీజీఎస్, ఎకనమిక్ రీజియన్లపై సమీక్ష 5

# దేశానికే ఆదర్శంగా పీ4



- పేదల జీవితాలు బంగారుమయం కావాలి
- ధనిక-పేద మధ్య అసమానతలు పోవాలి
- ప్రతి కుటుంబం స్థితిగతుల అధ్యయనం
- బంగారుమిత్రలు కార్యాచరణ రూపొందించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు
- బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సమావేశం

2

*పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నా రు. పీ4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. దీనిని ఎంబీకే-10:20 నమూనాగా అమలు చేస్తున్నామని, సమా జంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది ప్రజలు పేదరి కంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో సమావేశమయ్యారు.*



## ప్రభుత్వంపై దుష్ప్రచారానికి
# గొడ్డలి పార్టీ ఫండింగ్

- ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తోంది
- సోషల్ మీడియా ముసుగులో కుట్రలు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు
- అన్ని ప్రాంతాల్లో ప్రగతికి ప్రణాళికలు సిద్ధం
- నియోజకవర్గాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- త్వరలో అభివృద్ధి చెందిన కుప్పం చూస్తాం
- గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతాం
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

3

*గొడ్డలి పార్టీ నేతలు ప్రత్యేకంగా ఫండింగ్ చేసి మరీ ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేయిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. తనతో పాటు పవన్‌కళ్యాణ్‌పై విమ ర్శలు చేసేందుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు పెద్దఎత్తున ఫండింగ్ ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. గొడ్డలి పార్టీ హింస, బూతులను నమ్ముకుని ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రగతి ఆగదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ప్రగతికి అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మూడురోజులుగా కుప్పంలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. త్వరలోనే సరికొత్తగా ముస్తాబైన అభివృద్ధి చెందిన కుప్పాన్ని ప్రజలు చూడబోతున్నారని వివరించారు.*



## ప్రవాసాంధ్రులంతా
# ఏపీ బ్రాండ్ అంబాసిడర్లే

- మీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం
- రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించండి
- ప్రతి పెట్టుబడిదారుడికి స్వాగతం పలుకుతాం
- భారత్‌లో కొరియాకు ఏపీ నమ్మకమైన భాగస్వామి
- కియా వంటి సక్సెస్ స్టోరీల కోసం ఎదురుచూస్తున్నాం
- సియోల్ తెలుగు డయాస్పోరాలో మంత్రి లోకేష్

8

*ప్రవాసాంధ్రులంతా ఏపీ బ్రాండ్ అంబాసిడర్లే..మీరు విజయాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచిపేరు సంపాదించి నప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడు తుంది.. మీరు వెళ్లే ప్రతిచోటా రాష్ట్ర అభివృద్ధి గాథను చెప్పాలన్న ది తన ఆకాంక్ష అని నని మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. వారంరోజుల పర్యటనలో భాగంగా దక్షిణకొరియా ఆహ్వానం మేరకు వచ్చిన తొలిరోజు సియోల్‌లో జరిగిన తెలుగు డయాస్పో రా సమావేశంలో పాల్గొన్నారు. ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టాలని కోరాలి. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతామని పిలుపునిచ్చారు.*



## కుప్పం క్లస్టర్ల నుంచి నగరాలకు ఉద్యాన ఉత్పత్తులు

- ఐటీసీ, వీఐఎస్వీ సంస్థలతో కడా ఒప్పందం
- ప్రకృతి సేద్యమే భూమి ఆరోగ్యానికి శ్రీరామరక్ష
- మన రైతులు ప్రపంచానికి నమూనాగా నిలవాలి
- కుప్పం రైతులతో సమావేశంలో సీఎం చంద్రబాబు

4

## దక్షిణకొరియా భారత రాయబారితో లోకేష్ భేటీ

- కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలు ఏపీకి వచ్చేలా సహకరించాలి
- తీరంలో హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్, బ్యాటరీ/ గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం విజ్ఞప్తి
- కియా/హ్యుందాయ్ ఆటో-ఈవీ క్లస్టర్ విస్తరణపై చర్చ
- ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో సిద్ధమని వెల్లడి

6



## మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు

- ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



10

చైతన్యరథం





# దేశానికే ఆదర్శంగా పీ4

- పేదల జీవితాలు బంగారుమయం కావాలి
- ధనిక-పేద మధ్య అసమానతలు పోవాలి
- ప్రతి కుటుంబం స్థితిగతుల అధ్యయనం
- బంగారుమిత్రలు కార్యాచరణ రూపొందించాలి
- సీఎం చంద్రబాబు పిలుపు
- బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సమావేశం



కుప్పం (చైతన్యరథం): పేదరిక నిర్మూలనకు ప్రజల భాగస్వా మ్యంతో కూడిన శాశ్వత పరిష్కారంగా పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పేదల జీవితాలు బంగారుమయం కావాలనే ఉద్దేశంతోనే పీ4 ద్వారా బంగారు కుటుంబాలు-మార్గదర్శుల విధానాన్ని అవలంభిస్తున్నా మని చెప్పారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశా నికి బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మెగా, అదానీ, టీవీఎస్ మోటార్‌సైకిల్స్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. బంగారు కుటుంబాలు కేవలం ప్రభుత్వ సహాయంపై ఆధారపడే పరిస్థితిలో కాకుండా, ఆర్థికంగా ఎదిగి ఇతరులకు సైతం చేయూ తనిచ్చే స్థాయికి చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇందుకోసం బంగారుమిత్రల సహకారంతో ప్రతి కుటుంబం స్థితి గతులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ వారి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పీ4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించేం దుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. దీనిని ఎంబీకే-10:20 నమూనాగా అమలు చేస్తున్నామని, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.

### సమాజంపై నమ్మకాన్ని పెంపొందిస్తోన్న మార్గదర్శులు

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించారు. వీరికి అండగా నిలిచేందుకు ఇప్పటి వరకు 1.10 లక్షల మంది మార్గదర్శులు ముందుకురావడం పీ4 కార్యక్రమంపై సమాజంలో ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చి వెళ్లిపోవడం మాత్రమే ఈ కార్యక్ర మం ఉద్దేశం కాదని, కుటుంబాల జీవన ప్రమాణాలను శాశ్వతం గా మెరుగుపరిచేలా మార్గనిర్దేశం చేయడమే అసలు లక్ష్యమని స్పష్టం చేశారు. కుప్పం నియోజక వర్గంలో 9 వేల బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసే బాధ్యతను అదానీ, టీవీఎస్, మెగా సంస్థలకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కుటుంబాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ వారి జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకు రావడానికి సంస్థలు, మార్గ దర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీ4 కార్యక్రమం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకున్న బంగారు కుటుంబాల విజయగాథలను రాష్ట్ర ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాం టి విజయాలు మరెంతో మందికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అలాగే తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు ముందుకొ చ్చిన మార్గదర్శులపై బంగారు కుటుంబాలు కృతజ్ఞతా భావంతో ఉండా లని సూచించారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలం టే ఆదాయాలు పెరగాలని, ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి కుటుంబం మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలని ఆకాంక్షిం చారు. రాష్ట్రంలో పీ4 కార్యక్రమాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచే నమూనాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగు తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ల ప్రసాద్, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మర్చిపోలేని సాయం అందించారు

**సీఎం చంద్రబాబుకు మహిళ కృతజ్ఞతలు**

పీ-4 కార్యక్రమం ద్వారా తమ జీవితంలో మర్చిపోలేని సాయం అందించారని బంగారు కుటుంబానికి చెందిన సరస్వతి అనే మహిళ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేలుకు తాము జీవితాంతం రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది. తమకు మార్గదర్శి అయిన టీవీఎస్ సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మరో 10 మందికి స్ఫూర్తిగా నిలవాలి

**విద్యార్థినికి సీఎం చంద్రబాబు ప్రశంసలు**

*తల్లిని కోల్పోయి, అమ్మమ్మ కష్టాలను స్ఫూర్తిగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్న ఓ విద్యార్థి తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయంగా సంభాషించారు. పీ-4 కార్యక్రమం ద్వారా అదానీ ఫౌండేషన్ సహకారంతో ఒకవైపు విద్యను కొనసాగిస్తూనే..మరోవైపు కుటుంబ జీవనోపాధికి తోడ్పా టునందిస్తున్న వైనాన్ని అభినందించారు. డిగ్రీ పూర్తిచేసి ల్యాబ్ టెక్నీషియన్‌గా మాత్రమే కాకుండా పరిశోధన, అభివృది రంగం లోనూ ప్రతిభ చాటుతూ భవిష్యత్తులో శాస్త్రవేత్తగా ఎదిగే లక్ష్యంతో ముందుకుసాగాలని ప్రోత్సహించారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్న అనంతరం పీ-4 కార్యక్రమం ద్వారా సమాజానికి తిరిగి సేవ చేయాలని, తనలాంటి యువత మరో పదిమందికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు.*





చైతన్యరథం





### ప్రభుత్వంపై దుష్ప్రచారానికి

# గొడ్డలి పార్టీ ఫండింగ్




- ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తోంది
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు
- అన్ని ప్రాంతాల్లో ప్రగతికి ప్రణాళికలు సిద్ధం
- నియోజకవర్గాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- త్వరలో అభివృద్ధి చెందిన కుప్పం చూస్తాం
- గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతాం
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

కుప్పం (చైతన్యరథం): గొడ్డలి పార్టీ నేతలు ప్రత్యేకంగా ఫండింగ్ చేసి మరీ తమ ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేయిస్తున్నా రని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. మూడురోజులుగా కుప్పంలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనతో పాటు పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేసేం దుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు పెద్దఎత్తున ఫండింగ్ ఇస్తున్నారని విమర్శించారు. గొడ్డలి పార్టీ హింస, బూతులను నమ్ముకుని ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తోందని మండిప డ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా జరుగు తున్నాయని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రగతి ఆగదని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కుప్పం నియోజక వర్గం లో ప్రాజెక్టులు వస్తున్నాయని.. రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లోనూ కుప్పానికి కనెక్టివిటీ పెంచుతున్నామని వివరించా రు. త్వరలోనే సరికొత్తగా ముస్తాబైన, అభివృద్ధి చెందిన కుప్పాన్ని ప్రజలు చూడబోతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి నియో జకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

**డిసెంబరుకి క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యకలాపాలు**

అభివృద్ధి వికేంద్రీకరణ విధానంలో అన్ని ప్రాంతాలూ ప్రగతి సాధించేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేశాం. రాష్ట్రంలో క్వాంటమ్, సెమీ కండక్టర్ల విభాగాల్లో భారీగా పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగానే వచ్చే డిసెంబరు నాటికి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంట ర్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇంధన రంగంలోనూ సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర అత్యు త్తమ విద్యుత్ సరఫరా విధానాలను అందుబాటులోకి తెస్తున్నామ న్నారు. దేశంలోనే ప్రముఖ స్టీల్ పరిశ్రమలైన ఆర్సెలార్ మిత్తల్, జేవిస్టబ్ల్యూ కంపెనీలు ఏపీలో తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తు న్నాయని..కేవలం పరిశ్రమలే కాకుండా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికీ ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు.

**భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయ్యాయి**

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు వెళుతుంటే కొందరు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. గత పాలకులు, కంపెనీ లకు భూములు ఇచ్చి వివాదాల్లోకి నెట్టారని, కేవలం ఒకే ఒక్క వ్యక్తి లబ్ధి కోసం విలువైన భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయిం దని తెలిపారు.

ఓబుళాపురంతో పాటు ఆన్ రాక్ సంస్థలు కూడా ఈ తరహాలోనే తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాయని చెప్పారు. కంపెనీలను తరిమేయడం, పరిశ్రమలు పారిపోయేలా చేయడమే వైకాపా నాయకులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం కష్టపడి తీసుకువచ్చిన ప్రతి ప్రాజెక్టునూ తామే తెచ్చా మని వారు దగా మాటలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. గత పాలకులు ఏజెన్సీ ప్రాంతాన్ని గంజాయి సాగుడు కేంద్రంగా మార్చేశారని, పవిత్ర తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసి ఇప్పుడు సిగ్గులేకుండా నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం వరకూ కృష్ణా. బలాలు తెచ్చామని... త్వర లోనే గాలేరు-నగరి ప్రాజెక్టును కూడా పూర్తి చేసి తీరుతామని తెలిపారు.

చైతన్యరథం



## కుప్పం క్లస్టర్ల నుంచి

# నగరాలకు ఉద్యాన ఉత్పత్తులు

- ఐటీసీ, వీఐఎస్వీ సంస్థలతో కడా ఒప్పందం
- ప్రకృతి సేద్యమే భూమి ఆరోగ్యానికి శ్రీరామరక్ష
- మన రైతులు ప్రపంచానికి నమూనాగా నిలవాలి
- ఆధునిక వ్యవసాయ విధానాలతో ప్రయోజనం
- డిమాండ్ ఉన్న ఉత్పత్తుల సాగుకు ప్రణాళికలు
- కుప్పం రైతులతో సమావేశంలో సీఎం చంద్రబాబు







కుప్పం(చైతన్యరథం): దేశంలోని గోల్డెన్ క్వాడ్రిలేటరల్ తరహా లోనే నదుల అనుసంధానం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. గంగా– కావేరి అనుసంధానం ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు నీటి భద్రతను సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. కుప్పంలో స్థానిక రైతులతో నిర్వహించిన ఆత్మీయ పలకరింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు సీఎం చంద్రబాబు సమక్షంలో స్థానిక రైతులకు ప్రయోజనం కలిగేలా ఐటీసీ సంస్థతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఒప్పందం కుదుర్చు కుంది. కుప్పంలోని పండ్లు, కూరగాయల క్లస్టర్ల ద్వారా బెంగుళూ రు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేలా ఈ ఒప్పందం జరిగింది. ఆధునిక, సుస్థిర వ్యవసాయ విధానాలు, ఉత్పత్తులకు విలువ జోడింపుపై కడాతో విశాలాక్షి ఇన్నోవేషన్స్ సస్టెయినబుల్ వ్యాల్యూ చైన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ నీటి భద్రతతో పాటు పర్యాటకాన్ని కూడా కుప్పంలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసు కుంటున్నాం. హంద్రీనీవా నీరు ఈ ప్రాంతానికి తరలించగలి గాం. శ్రీశైలం నుంచి కంగుంది వరకూ నీళ్లు వచ్చాయి. శ్రీశైలం మల్లన్న దగ్గరి శ్రీశైలం డ్యామ్ నుంచి తిరుపతి వెంకన్న దగ్గరున్న కల్యాణి డ్యామ్ వరకూ త్వరలోనే నీళ్లు తీసుకువస్తాం. మన దగ్గర పడిన వర్షాన్ని భూగర్భజలాలుగా మార్చుకునే ప్రయత్నం చేద్దాం. దీనికి సంబంధించిన స్ట్రక్చర్ల నిర్మాణాలు జరగాలి. తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లను ప్రారంభించే సమయంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పరీవాహక ప్రాంతంలో నీటి పారుదలపై ఏకాభిప్రాయానికి వచ్చాం. రైతుల ప్రయోజనాలు కాపాడేలా చర్య లు ప్రారంభించాం. గోదావరి– కావేరిని కలిపితే దక్షిణాదిలో నీటి కరవు తీర్చేందుకు ఆస్కారం ఉంటుంది. దేశంలోని ఇతర నదులు కూడా అనుసంధానం చేసుకుంటేనే పరిస్థితులు మారతాయి. మహానది నుంచి కావేరి వరకూ– అలాగే గంగానది నుంచి కావే రి వరకూ గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారిలా నదుల అనుసం ధానం జరగాలి. అదే జరిగిదే ఇక దేశానికి కరువు అనేదే రాదు. రైతులకు విస్తృత ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు.

### ఆధునిక వ్యవసాయ పద్ధతులతో ఆదాయం

ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక ఆదాయం, మెరుగైన దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉంది. రైతులు ఆధునిక విధానాలను అనుసరించటంతో పాటు మెరుగైన మార్కె టింగ్‌ను అందిపుచ్చుకోవాలి. కుప్పంలో నియంత్రిత వాతావరణం లో 10 వేల టన్నుల టమాటోలు పండించి ఎగుమతి చేసేలా ఐటీసీ సంస్థ ప్రణాళిక చేస్తుంది. వెయ్యి ఎకరాల్లో ఈ సాగు చేపట్టేందుకు ఐటీసీ ముందుకు వచ్చింది. ఆదర్శ రైతులు దీనికి సహకరించాలి. రూ.8 కోట్లను వ్యయం చేసి ఐటీసీ సంస్థ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుంది. పౌల్ట్రీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి. రూ.10 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టులు కుప్పంలో వచ్చాయి. ఏబీఐఎస్, మదర్ డెయిరీ, ఐటీసీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. ఉద్యాన ఉత్పత్తులను సాగు చేయటంలో రాయల సీమ దేశంలోనే నెంబర్ 1 స్థాయికి చేరుకుంది. పూర్వోదయ స్కీమ్ ద్వారా ప్రభుత్వం రూ.40 వేల కోట్లు, ప్రైవేటు రంగంలో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు ఈ ప్రాంతానికి వస్తాయి. రహదా రులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెడతాయి. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న పండ్లు, ఉద్యాన ఉత్పత్తులను సాగు చేసేలా ప్రణాళికలు చేద్దాం. ఆధునిక వ్యవసాయ విధానాలను, పరికరాలను రైతులు ఉపయోగించాలని స్పష్టం చేశారు.

### ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు

పురుగుమందులు వాడకుండా ప్రకృతి సేద్యంతో మన రైతులు ప్రపంచానికి నమూనాగా నిలవాలి. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఈ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. మన రైతుల కృషికి చేసిన పనికి గుర్తింపుగా స్విట్జర్లాండ్‌లో ప్లానెట్ ఫుడ్ ప్రైజ్ ఇచ్చారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రకృతి సేద్యం ద్వారానే సాధ్యం అవుతుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా ఉద్యోగా లు వదిలిపెట్టి ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నా రని తెలిపారు. గత సీజన్‌లో రూ.4 చొప్పున తోతాపురి మామిడికి అదనపు ధర ఇచ్చామని.. రూ.259 కోట్ల మేర రైతులకు సాయం అందించామని వివరించారు. ఈసారి కూడా రైతులకు సాయం అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. మిల్లెట్ చెఫ్ పేరిట మైదా, పంచదార లేకుండా తయారు చేసిన బేకరీ ఫుడ్ స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. ఆ సంస్థ రూపొందించిన రైస్ ఫ్రీ హోటల్ కాన్సెప్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్ చెఫ్ బేకరీలు కుప్పంలో రెండు ప్రారంభించాలని కోరారు. అంతకుముందు ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడి సాగు విధానాలు తెలుసుకుని వారిని అభినందించారు.



## వారంరోజుల తర్వాత

# నేడు అమరావతికి సీఎం చంద్రబాబు

- ఆర్టీజీఎస్, ఎకనమిక్ రీజియన్లపై సమీక్ష
- విజయవంతంగా సాగిన జిల్లాల పర్యటన
- హీరో, అడిడాస్, జేఎస్‌డబ్ల్యు సంస్థలకు శంకుస్థాపన
- మూడురోజుల కుప్పం పర్యటనలో భాగంగా
- 30కి పైగా అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం



కుప్పం (చైతన్యరథం): వరుసగా వారంరోజుల జిల్లాల పర్యట న అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం తిరిగి అమరావతికి రానున్నారు. సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షతో సహా పలు సమావేశాలు నిర్వహించనున్నారు. వారంరోజులు క్షణం తీరిక లేకుండా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు మొత్తం 4 జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాప నలు, ఎంవోయూలు, సంక్షేమ కార్యక్రమాలు, రైతులు-ప్రజలతో ముఖాముఖి వంటి సమావేశాలతో పర్యటన సాగింది. ఈనెల 1వ తేదీన అమరావతి నుంచి బయలుదేరి నేరుగా నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెం చేరుకున్న ముఖ్య మంత్రి అక్కడ నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో మొదట పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లిన సీఎం చంద్రబాబు పద్మమ్మకు ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్, తులశమ్మకు దివ్యాంగ పింఛన్ అందించారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఇప్పటివరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అభివృద్ధిలో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, తర్వలో నెల్లూరు జిల్లాలో మెగా ఫర్నిచర్ పార్కు కూడా ఏర్పాటు కానుందని చెప్పారు. జిల్లాకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇస్తామని ప్రకటించారు.

### తొలిరోజు హీరో మోటార్స్‌కు శంకుస్థాపన

నెల్లూరు జిల్లాలో పేదల సేవలో కార్యక్రమం పూర్తి కాగానే... అదేరోజు తిరుపతి జిల్లా సత్యవేడులోని మాదన్నపాలెం వెళ్లారు. అక్కడ హీరో మోటార్స్ సంస్థకు చెందిన గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. స్వర్ణాంధ్ర ఫౌండేషన్‌తో కలిసి పీ4లో భాగస్వామ్యం వహించేందుకు హీరో మోటార్స్ కార్పోరేషన్ ఈ సందర్భంగా ముందుకు వచ్చింది. ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బ్రిజ్ మోహన్‌లాల్ ముంజాల్ హీరోస్ ఆఫ్ టుమారో పేరిట ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్‌లను ఆవిష్కరించారు.




### 2న వీబీ జీ రామ్ జీ ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీని 2వ తేదీన ఉదయం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నుంచి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీ జీ రామ్ జీ కింద పనులు చేపట్టనున్నాయి. ఆ తర్వాత 2వ తేదీ సాయంత్రం తిరుపతి చేరుకున్నారు. అక్కడ స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రణాళిక శాఖ తిరుపతిలో నిర్వహించిన ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

### 3న రాయలసీమ స్టీల్ పనుల ప్రారంభం

రాయలసీమ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే లా ఈనెల 3న కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులనూ ప్రారంభించారు. జమ్మల మడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రా మిక పార్కును కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది.

### కుప్పం మూడురోజుల పర్యటన సక్సెస్

ఈనెల 3వ తేదీన కడప నుంచి నేరుగా ముఖ్యమంత్రి మూడు రోజుల పర్యటన కోసం కుప్పం వచ్చారు. గుడుపల్లె మండలం పొగురుపల్లిలో నిర్వహించిన 'స్వర్ణ కుప్పం-పెట్టుబడుల వేదిక' బహిరంగ సభలో పాల్గొన్నారు. రూ.9,322 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 30 ప్రాజెక్టులకు ఎంవోయూలు, ప్రారంభోత్సవా లు, శంకుస్థాపనలు చేశారు. వీటితో ప్రత్యక్షంగా 39,535 మందికి, పరోక్షంగా 47,539 మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రపంచ ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ సంస్థ నుంచి ఎయిర్ క్రాఫ్ట్ ట్రైనింగ్ విమానాల తయారీ ప్రాజెక్టు వరకు వీటిలో ఉన్నాయి. పౌల్ట్రీ రైతులకు లాభం చేకూర్చే చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏబీఐఎస్ ప్రొటీన్స్ సంస్థను, 167 పారిశ్రామిక ప్లాట్లతో తీర్చిదిద్దిన ఏపీఐఐసీ ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభిం చారు. అలాగే 7,489 మంది ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై రూ.28 కోట్లతో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ప్రజలకు అంకితం చేశాం. ఐదు RESCO సబ్‌స్టేషన్లు ప్రారంభించారు. 46 వేలకుపైగా బీసీ, ఓసీ కుటుంబాల ఇళ్లపై రూ.559 కోట్లతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

### మోడల్ బస్‌స్టేషన్‌కు శంకుస్థాపన

కుప్పం పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేసే లక్ష్యంలో భాగంగా రెండవ రోజుల పర్యటనలో అత్యాధునిక మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.118 కోట్లతో నిర్మించే ఈ మోడల్ బస్ స్టేషన్ రాష్ట్రంలోనే అత్యాధునిక బస్‌స్టేషన్లలో ఒకటిగా నిలవనుంది. అదే రోజు ఆరు దశాబ్దాల కంగుంది భూసమస్యకు సీఎం పరిష్కారం చూపారు. 'అదవి పోరంబోకు' నుంచి 'అసెస్డ్ వేస్ట్ డ్రై'గా వర్గీకరిం చి భూములు సాగు చేస్తున్న రైతన్న కుటుంబాలకు మేలు చేశారు. మొత్తం 322 మంది అర్హులైన లబ్ధిదారులకు 460.19 ఎకరాలపై డీకేటీ పట్టాలు అందజేశారు. మరోవైపు కుప్పం ఏరియా ఆస్పత్రి లో సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభిం చారు. ఆసుపత్రిలో పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణ కుప్పం స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ప్రారంభించారు.

### చివరిరోజు రైతులు, పీ4 లబ్ధిదారులతో ముఖాముఖి

కుప్పంలో మూడవ రోజు పర్యటనలో ఆదివారం పౌల్ట్రీ రైతులు, అభ్యుదయ రైతులు, పీ4 లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి సమావేశం అయ్యారు. పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫారంను ప్రారంభించి పరిశీలించారు. కుప్పం అభ్యుదయ రైతులతో సమా వేశమై పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో స్థానిక రైతులకు ప్రయోజనం కలిగించేలా ఐటీసీ సంస్థతోనూ, ఆధునాతన వ్యవసాయ విధానాలు అనుసరిం చేలా విశాలాక్షి ఇన్నోవేషన్స్ సస్టైయినబుల్ వ్యాల్యూ చైన్ సంస్థ తోనూ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే కుప్పం- పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. కుప్పంలో 9 వేల బంగారు కుటుంబాల బాధ్యతను అదానీ, టీవీఎస్, మెగా సంస్థలకు అప్పగించామని తెలిపారు. ఆదివారం రాత్రి కుప్పంలోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు నేరుగా కుప్పం నుంచి అమరావతిలోని వెలగపూడి సచివాలయానికి చేరుకుంటారు. సోమవారం కూడా అధికారిక సమీక్షలు, సమావేశాలతో ముఖ్యమంత్రి బిజీగా గడపనున్నారు. ఉదయం ఆర్టీజీఎస్ సమీక్ష చేయనున్నారు. మధ్యాహ్నం విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించి అభివృద్ధి కార్యాచరణపై అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.





చైతన్యరథం

# పనిచేసే వారిని విస్మరించం

- పనితీరు ఆధారంగానే పదవులు
- త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి
- అన్ని స్థానాల్లో మనమే గెలిచి తీరాలి
- కుప్పం శ్రేణులతో సమావేశంలో చంద్రబాబు

కుప్పం (చైతన్యరథం): పార్టీ కోసం పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించమని, పనితీరు ఆధారంగానే పదవులు దక్కుతాయని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా నికార్సైన కార్యకర్తలను గౌరవించాలి. బూత్‌స్థాయి మొదలుకుని ఏ పదవి కైనా కార్యకర్తల ఆమోదం ఉండాల్సిందేనని తెలిపారు. మూడో రోజు పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, కుప్పం నియోజకవర్గ ముఖ్యనేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పై స్థాయిలోనే కాదు.. క్షేత్రస్థాయిలో కూడా పొలిటి కల్ గవర్నెన్స్ ఉండాలి. సమస్యల పరిష్కారం విషయంలో పోలీసు లు, అధికారులతో పార్టీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను ప్రభుత్వ, పోలీసు అధి కారులకు వివరించి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. మంచికి అండగా నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రభుత్వ యంత్రాంగం గౌరవించాల్సిందే. ప్రజలతో అనుసంధానమై ప్రభు త్వ పథకాల అమలును కార్యకర్తలు, నేతలు పరిశీలించాలి. పథకాల అమలు లో ఏమైనా ఇబ్బందులు, జాప్యం జరిగితే వాటిని సరిచేసే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఛారిటీ చేద్దాం..పార్టీ ద్వారా రాజకీయమే చేద్దాం. గొడ్డలి పార్టీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి. కుప్పం నియోజక వర్గం లో ఎవరైనా రౌడీయిజం చేయాలనుకుంటే కుదరదని హెచ్చరించారు.

### 2019-24 రాష్ట్రానికి ఓ పీడ కల

2019-24 మధ్య కాలంలో రాష్ట్రానికి ఓ పీడ కల. కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతత చెడగొట్టాలని నాటి పాలకు లు ప్రయత్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో రాబోతు న్నాయి. అన్ని స్థానాల్లోనూ మనమే గెలిచితీరాలి. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానికసంస్థలు మొత్తం కూటమే గెలవ బోతోంది. తెలుగుదేశం కార్యకర్తలు, నేతలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉంటుంది. చెడ్డపేరు తెచ్చుకునేలా ఏ ఒక్క నేత, కార్యకర్త వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.



### 2029 ఎన్నికల్లో వచ్చి తీరుతాం

పదవుల నియామకాల్లో ఎలాంటి మొహమాటాలు ఉండవు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించం... ద్వితీయ శ్రేణి నాయకులు కూడా నికార్సైన కార్యకర్తలను గౌర వించాలి. బూత్‌స్థాయి మొదలుకుని ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం ఉండాల్సిందే. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతాం. గతానికంటే మెజార్టీలు పెరిగేలా కృషిచేయాలి. కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీ పరంగా కృషి చేస్తున్నాం. ఇంటికో పారిశ్రామికవేత్త విధానాన్ని అమలు చేస్తున్నాం.. దీన్ని ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలు కూడా అందింపుచ్చుకోవాలి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిం చా లి. పార్టీ సూచనలకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టాలి. అందరి ఆమోదంతో కుప్పంలో సమన్వయ కమిటీ వేస్తామని తెలిపారు.





# కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలు



- ఏపీకి వచ్చేలా సహకరించాలి
- దక్షిణకొరియాలో భారత రాయబారితో లోకేష్ భేటీ
- తీరంలో హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్,
- బ్యాటరీ/ గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం విజ్ఞప్తి
- కియా/హ్యుందాయ్ ఆటో-ఈవీ క్లస్టర్ విస్తరణపై చర్చ
- ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో సిద్ధమని వెల్లడి

సియోల్ (దక్షిణకొరియా): మంత్రి నారా లోకేష్‌తో సియోల్‌లో దక్షిణకొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో ఆదివారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కే, ఏఎస్‌ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్‌ల ఆధారంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణం గా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఏపీకి రప్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి,





విశాఖపట్నంలలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా-అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు (వీఎల్‌ఎస్‌ఐ, ఏటీఎంపీ/ ప్యాకేజింగ్, ఎస్‌ఎంటీ, డిస్‌ప్లేలు) సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ ఏప్రిల్ 2026లో భారత్ పర్యటన సందర్భంగా "కొరి యా ఎన్‌క్లేవ్" ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు కొరియన్ చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొరియా ప్రాధాన్యతా రంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవచూపాలని కోరారు. అనంతపురంలో కియా/హ్యుందాయ్ మోబిస్ ఆటో-ఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డీ హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ఏర్పాటు, బ్యాటరీ/గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. ఏపీ -కొరియా మధ్య సంబంధాల బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. కొరియా ప్లస్, KOTRA, భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక ఏపీ--కొరియా డెస్క్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈనెల 10న నిర్వహించే సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో, +2+ అవగాహన ఒప్పందాల వైపు మళ్లించేలా చొరవ చూపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# కుప్పంలో పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫారం

## ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



కుప్పం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫారంను ప్రారంభించారు. ఆధునిక కోళ్ల పెంపకానికి సంబంధిం చిన ఎన్విరాన్‌మెంటల్ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్‌ను పూర్తిగా పరిశీలిం చారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఉష్ణోగ్రత, తేమ, గాలి, వెలుతురు అన్నింటినీ సాంకేతికత ద్వారా నియంత్రించి కోళ్లకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించవచ్చని రైతులు వివరించారు. దీనివల్ల గుడ్లు, మాంసం ఉత్పత్తి పెరగడంతో పాటు, కోళ్లు చనిపోవడం తగ్గుతుందని తెలిపారు. ఈ ఆధునిక పౌల్ట్రీ షెడ్‌తో అన్ని కాలాల్లోనూ రైతులు స్థిరమైన ఉత్పత్తి సాధించగలరని తెలిపారు.









# తేదేపా నేత ఇంటికి చంద్రబాబు

## కుటుంబానికి ఆత్మీయ పలకరింపు - కుప్పం వాసుల నుంచి వినతుల స్వీకరణ



కుప్పం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెంగాచారి ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. కడపల్లిలోని తన నివాసం నుంచి కుప్పం వెళుతున్న సమయంలో చెంగాచారి కోరిక మేరకు శాంతిపురంలోని ఆయన ఇంటికి వెళ్లారు. చెంగాచారి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు తన నివాసం వద్దకు వచ్చిన కుప్పం వాసుల నుంచి వినతులు అందుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. చిన్నారులను ఎత్తుకుని ఆడించారు.











# ప్రవాసాంధ్రులంతా ఏపీ బ్రాండ్ అంబాసిడర్లే

- మీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం
- రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించండి
- ప్రతి పెట్టుబడిదారుడికి స్వాగతం పలుకుతాం
- భారత్‌లో కొరియాకు ఏపీ నమ్మకమైన భాగస్వామి
- కియా వంటి సక్సెస్ స్టోరీల కోసం ఎదురుచూస్తున్నాం
- సియోల్ తెలుగు డయాస్పోరాలో మంత్రి లోకేష్







సియోల్ (దక్షిణకొరియా): ప్రవాసాంధ్రులంతా ఏపీ బ్రాండ్ అంబాసిడర్లేనని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మీరు విజ యాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచిపేరు సంపాదించినప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడుతుంది.. మీరు వెళ్లే ప్రతిచోటా రాష్ట్ర అభివృద్ధి గాథను చెప్పాలన్నది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. వారంరోజుల పర్యటనలో భాగంగా దక్షిణకొరియా ఆహ్వానం మేరకు వచ్చిన లోకేష్ తొలిరోజు ఆదివా రం సియోల్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించండి, వేగవంతమైన అనుమతులు, పాం దర్శక పాలనను తెలియజేయండి. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరండి. ఒకసారి మన రాష్ట్రాన్ని చూసిన వారు వెంటనే మన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటారు. ఏ రంగంలో అయినా కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. మేం నిజాయితీతో ప్రతి పెట్టుబడిదారుడికీ స్వాగతం పలుకుతాం. ప్రతి ఆవిష్కర్త కంపెనీని మేం ఆదరిస్తాం. భారతదేశంతో కలిసి పనిచేసే ఆసక్తి ఉన్న ప్రతి వ్యక్తికీ స్వాగతం పలుకుతామని పిలుపునిచ్చారు.

### ఎన్ఆర్ఐల ప్రతి విజయం దేశానికి గర్వకారణం

ప్రపంచంలో తెలుగు ప్రజలు లేని దేశం లేదు. ఏ దేశానికి, ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ తెలుగు ప్రజల ఉనికి ఉంటుంది. నేను ఎక్కడికెళ్లినా నా పరిచయాలు తెలుగు సమాజంతోనే మొదలవుతాయి. విదేశాల్లో ఉంటున్న తెలుగు వారికి తమ దేశం, సంస్కృతిపై అపారమైన ప్రేమ. వారు ఎంతదూరంలో ఉన్నా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తారు. దక్షిణ కొరియాలోని భారతీయ సమాజానికి నా హృదయపూర్వక అభి నందనలు. ఎంబసీ అధికారులు, నిర్వాహకులు, ఈ వేదిక ఏర్పాటుచేసిన ప్రతిఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తు న్నాను. దేశం నుంచి దూరంగా ఉన్న ప్రతి భారతీయుడిని కలిసిన ప్రతిసారీ నాకు ఒకింత గర్వంగా ఉంటుంది. మీ కష్టపడేతత్వం, నైపుణ్యం, సంకల్పం ద్వారా మీరు భారత్ గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్నారు. మీ ప్రతి విజయం భారతదేశ ప్రతిష్టను పెంచుతుందని ప్రశంసించారు.

### దక్షిణకొరియా విజయగాథ మనకు ప్రేరణ

దక్షిణకొరియా అభివృద్ధి ప్రయాణం ఆదర్శనీయం. దక్షిణ కొరియా ఇప్పుడు శాంసంగ్, హ్యుండయ్, ఎల్‌జీ, కియా వంటి ప్రఖ్యాత కంపెనీలను ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుతున్నా యి. సంపద కేవలం ప్రకృతి వనరుల ఆధారంగా రాదని.. శ్రమ, ఆవిష్కరణ, శాస్త్రీయ దృక్పథం, తపన ద్వారానే దేశాలు అభివృద్ధి పథంలో ముందుంటాయని దక్షిణకొరియా నిరూపించింది. దక్షిణ కొరియా విజయగాథ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి పెద్ద ప్రేరణ. భారత్ – దక్షిణకొరియా మధ్య సంబంధం కేవలం వాణిజ్యం మాత్రమే కాదు. మన భాగస్వామ్యం ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ఆవిష్కరణ, యువతపై పెట్టుబడి అనే పటిష్ట మూలాలపై ఆధారపడి ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో ఎలక్ట్రాని క్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, షిప్ బిల్డింగ్, గ్రీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నత విద్య వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి మంచి ఫలితాలను సాధించాయని గుర్తుచేశారు.

### కియాతో ఆటోమొబైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి

కియా విజయగాథ మనకు ఆదర్శం. కియా తమ మొదటి ఇన్–ఇండియా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తు న్నపుడు ఆంధ్రప్రదేశ్ తక్షణ నిర్ణయం తీసుకుని పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలు సమకూర్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఆవిష్కృ తమైందే కియా ప్లాంట్. కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా మారి వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించింది. మన ఈ ప్రయాణాన్ని మరిన్ని సక్సెస్ స్టోరీలుగా మార్చాలి. ఐటీ, సెమి కండక్టర్లు, మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీలు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఏ రంగంలో అయినా దక్షిణకొరియాకు భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ అత్యంత నమ్మకమైన భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉంది. వచ్చే దశాబ్దం ఏపీ కేంద్రంగా భారత్–దక్షిణకొరియా సంబంధా లు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో కొత్త భాగస్వామ్యాలు వికసిస్తాయని ఆకాంక్షించారు.

### యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం

ఈరోజు ఆంధ్రప్రదేశ్ ఒక కొత్త అభివృద్ధి దశలోకి ప్రవేశించిం ది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో మేం పెట్టుబడిదారుల నమ్మకాన్ని తిరిగి పొంది యువతకు కొత్త అవకా శాలను కల్పిస్తున్నాం. ప్రపంచ పెట్టుబడిదారులు ఇటీవల చూస్తు న్న వేగంగా నిర్ణయాలు తీసుకోవడం (స్పీడ్), పాలనా స్థిరత్వం (స్టెబిలిటీ), పెట్టుబడి తర్వాత నాణ్యమైన సేవ (సర్వీస్)లు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఏపీ అనుసరిస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) మోడల్‌తో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో పెట్టుబడిదారు లకు నమ్మకమైన ప్రాంతంగా మారింది. మేం అనుసరిస్తున్న ఇన్వె స్టర్స్ ఫ్రెండ్లీ విధానాల వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.

### పరిశ్రమ అవసరాల మేరకు విద్యావ్యవస్థలో మార్పులు

ప్రతి సంవత్సరం లక్షలాది యువత ఉద్యోగ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. వారికి అర్హతల ఆధారంగా నైపుణ్యాలు, అవకాశాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వంగా మాపై ఉంది. ఇందు కోసం మేము విద్యా వ్యవస్థను సమగ్రంగా పునఃరూపకల్పన చేసుకుంటున్నాం. మా పాఠ్యాంశాలను అధునాతన పరిశ్రమ క్లస్టర్ల ఆధారంగా రూపొందిస్తున్నాం. దీనివల్ల విద్యార్థులు పరిశ్ర మల అవసరాల మేరకు సిద్ధం కావడంతో పాటు ఆధునిక సాంకేతి క నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం పొందుతారు. మన విద్యార్థు లు గ్లోబల్ స్థాయి ఉద్యోగాల కోసం సన్నద్ధమవ్వాలి. సియోల్, టోక్యో, బెర్లిన్, సిలికాన్ వ్యాలీ ఎక్కడైనా పోటీ పడగలగాలి. అంత ర్జాతీయ భాషలను ప్రోత్సహించడం ద్వారా వారి అవకాశాలను మద్దతుగా నిలుస్తున్నామని తెలిపారు.

### బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బలమైన పునాది కలిగి ఉంది. కానీ మన దృష్టి ఎప్పుడూ జాతీయస్థాయిలో ఉంది. బలమైన రాష్ట్రాలే బలమైన భారత్‌ని నిర్మిస్తుందని మేము బలంగా నమ్ముతాం. ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ అభివృద్ధి ప్రణాళికలు కలిసి ముందుకు సాగితేనే విజయం సాధిస్తామన్నది మా నమ్మకం. మీరు వేల కిలోమీటర్ల దాటి ఇక్కడకు వచ్చినా ఆంధ్రప్రదేశ్ నుంచి మీరు ఎప్పుడూ దూరంగా లేరు. ఏపీఎన్ఆర్టీ ద్వారా మేము ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కుటుంబాలకు మద్దతుగా ఉంటూ విద్యార్థులు, కార్మికులకు అత్యవసర సాయం, సేవలు అందిస్తూనే ఉంటాం. గ్లోబల్ కమ్యూనిటీకి మద్దతుగా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ మీ వెంటే ఉంటుంది. కొరియా ఒక అద్భుత దేశంగా రూపుదిద్దు కుంది. భారత్ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అవకాశాలతో నిండిన భవిష్యత్తును నిర్మిస్తోంది. మనం కలిసికట్టు గా ఆ యజ్ఞంలో భాగస్వాములం అవుదాం. మరిన్ని పెట్టుబడుల ను ఆకర్షిద్దాం, ఎక్కువ ఉద్యోగాలను సృష్టిద్దాం, అధునాతన విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేద్దాం, మరిన్ని ఆవిష్కరణలను ప్రోత్స హిద్దాం. ఆంధ్రప్రదేశ్‌ను జీవించడానికి, పనిచేయడానికి, పెట్టుబ డి పెట్టడానికి అత్యుత్తమ ప్రదేశంగా మార్చుదాం. కలిసికట్టుగా బలమైన ఆంధ్రప్రదేశ్, బలమైన భారత్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

# చైతన్యరథం


Embassy of India Warmly Welcomes
Indian Diaspora in the Republic of Korea
Chief Guest
Shri Nara Lokesh
Hon'ble Minister of IT, E&C, HRD, RTG of Andhra Pradesh
LOTTE












NOROBABY











# మత్స్యకారుల కోసం గాలింపు ఆపరేషన్

## ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

కుప్పం(చైతన్యరథం): విశాఖ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ఆదేశించారు. సముద్రంలో మత్స్యకారుల గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే ఆయన కుప్పం నుంచి ఉన్నతాధికా రులతో ఫోన్‌లో మాట్లాడారు. బంగాళాఖాతంలో గల్లంతైన మత్స్య కారుల బోటును గాలించేందుకు కోస్టు గార్డ్ నౌక ప్రయత్ని స్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి INDAP-VS-MM-83 అనే బోటు ఏడుగురు మత్స్యకారులతో జూన్ 1న సాయంత్రం 4 గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయలుదేరి వెళ్లిందని తెలిపారు. 4 తేదీ మధ్యాహ్నానికి ఆ బోటు ఫిషింగ్ హార్బర్‌కు తిరిగి రావాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల ఇప్పటికీ తిరిగి రాలేదని వివరించారు. గంగవరం సముద్రతీరం సమీపంలో వారి బోటుకు సాంకేతిక సమస్య ఉత్పన్నమైనట్టుగా గుర్తించామని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి నౌకాదళానికి చెందిన హెలికాప్టర్ల ద్వారా కూడా గాలింపు చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం కోస్టు గార్డు, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలు గాలింపు చర్యలు చేపట్టినట్టు అధికారులు వివరించారు. దీనిపై స్పందించి న సీఎం సముద్రంలో చేపడుతున్న గాలింపు చర్యలను సమన్వ యం చేసుకోవాల్సిందిగా మెరైన్ ఐజీ, విశాఖ సీపీలను ఆదేశించారు. గాలింపు చర్యలకు సంబంధించిన అంశాలను తనకు ఎప్పటి కప్పుడు



తెలియచేయాలని సూచించారు. మత్స్యకారుల కుటుంబా లకు ధైర్యం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక విశాఖ ప్రజాప్రతినిధులకు ఆదేశాలిచ్చారు.

### 10 మంది మత్స్యకారులు సురక్షితం

ఒడిశా తీరంలో చిక్కుకుపోయిన విశాఖకు చెందిన మత్స్యకా రులు క్షేమంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సముద్రంలో చిక్కుకున్న 10 మందిని ఒడిశా మెరైన్ పోలీసులు కాపాడినట్లు వెల్లడించారు. బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారు లను రక్షించినట్లు పేర్కొన్నారు. ఒడిశా మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు వేగవంతం చేయడంతో బోటు సిబ్బందిని కాపాడగలిగినట్లు తెలిపారు. కాకి నాడ నుంచి ప్రత్యేక నౌక, హెలికాప్టర్లను రంగంలోకి దింపి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. మర్చంట్ షిప్ ద్వారా ఓ మత్స్యకారుడిని రక్షించామని, మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు.

### ఆరుగురు మత్స్యకారుల గల్లంతు

విశాఖ చేపల రేవు నుంచి ఈనెల 1వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన ఏడు గురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అలల తాకిడికి శనివారం మధ్యాహ్నం బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బోటు యజమాని కారె చిన్నయ్య ప్రాణాలతో బయటపడగా, మిగతా ఆరుగురు గల్లంతయ్యారు. వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# శాంతిభద్రతలపై జగన్‌రెడ్డి మాట్లాడటమా?

**- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది**

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎద్దేవా**

అమరావతి (చైతన్యరథం): చచ్చిపోయిన పార్టీని బతికించుకోవడానికి నీచ రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు చేసే గొడ్డలి పార్టీ అధినేత, ఆ పార్టీ నేతలు తప్ప రాష్ట్రంలో ప్రజలందరూ ప్రశాంతంగా ఉన్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే శవ రాజకీయాలు, డైవర్షన్ పాలిటిక్స్‌కు జగన్ తెరలేపుతున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతలపై జగన్మోహన్ రెడ్డి నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. సొంత పార్టీ ఎంపీనే కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వారు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కుల గురించి మాట్లాడటం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో 300 మంది బీసీలు, 192 మంది ఎస్సీలు, 58 మంది ఎస్టీలు, 11 మంది మైనార్టీలు, 2,027 మంది మహిళలు దారుణ హత్యలకు గురయ్యారు. టీడీపీ కార్యకర్తలపై 3000 కేసులు, 267 మంది అమరావతి రైతులపై 2,526 కేసులు, జనసేన కార్యకర్తలపై 2,014 కేసులు అక్రమ కేసులు బనాయించి వేధించారు. మహిళలపై నమోదైన 2,04,414 నేరాల విషయాన్ని జగన్మోహన్ రెడ్డి ఎందుకు ప్రజలకు చెప్పలేదో సమాధానం చెప్పాలని మంత్రి జనార్దన్ రెడ్డి నిలదీశారు.

### చట్టానికి లోబడి ఉండాలి

యూట్యూబర్ కేవీఆర్ అయినా, రావణ్ అయినా, సైకోలైనా... ఎవరైనా చట్టానికి లోబడే ఉండాలి. జర్నలిజం, ఇన్‌ఫ్లుయెన్సర్ ముసుగులో సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవు. అలాంటి వారిని, వారి వెనుకుండి నడిపించే వారినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు. విజయవాడలో సాయి కృష్ణ కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలకు సీఐ నాగరాజు అరెస్ట్ నిదర్శనం. తుని, పెద్దాపురం, కావలి ఘటనలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించాయి. ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రశ్నించడానికి, మహిళల వ్యక్తిత్వ హననానికి ఉన్న తేడా సొంత చెల్లిపైనే సైకో మూకతో నీచమైన ప్రచారం చేయించిన జగన్మోహన్ రెడ్డికి తెలియదు. ఐదేళ్లపాటు న్యాయమూర్తులు, మహిళా నాయకులు, వారి కుటుంబాల్లోని మహిళలను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించిన సైకో సైన్యాన్ని పెంచి పోషించింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసు. వాక్ స్వాతంత్ర్యం అంటే సభ్య సమాజం తలదించుకునేలా ట్రోలింగ్ చేయడం కాదని జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలి. మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన సొంత పార్టీ కార్యకర్తపైనా చర్యలు తీసుకున్న కూటమి ప్రభుత్వం, తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టదు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. ఇందులో రాజకీయ కక్షసాధింపు లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కోర్టులపై దాడులు చేయించడం, విపక్ష నేతలపై అక్రమ కేసులు నమోదు చేయించడం, రాష్ట్రాన్ని ఫ్యాక్షన్ రాజకీయాల కేంద్రంగా మార్చడం జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన వాస్తవాలు. ఆనాటి అరాచక 'రౌడీ రాజకీయ' వ్యవస్థను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. అరాచక శక్తుల నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడి, ప్రజలకు నిజమైన భద్రత



కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతి భద్రతల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం స్పందిస్తున్న తీరు చూస్తున్న రాష్ట్ర ప్రజలు.. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి నిత్యం నిరాధార ఆరోపణలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని అసహ్యించుకుంటున్నారని మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు.

# గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**- మంత్రి సంధ్యారాణి**

వినుకొండ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం వినుకొండ మండలంలోని చెక్కవాగు వద్ద రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులుతో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు పట్టణ స్థాయి సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణంలో చదువుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ గురుకుల భవనం విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మంత్రి సంధ్యారాణి గారువివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, ఉపాధి, సామాజిక భద్రత






వంటి అన్ని రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పేదలు, గిరిజనులు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రివర్యులు పిలుపునిచ్చారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్య, వసతి, పోషకాహారం, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల విద్యాసంస్థల సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

- రూ. 808 కోట్లతో 684 ఆలయాల పనులు
- ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆలయాలు... పెరుగుతున్న భక్తుల సంఖ్య
- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టీకరణ
- ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రాచీన ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ






నెల్లూరు (చైతన్యరథం): ప్రాచీన దేవాలయాల పరిరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం అనే మూడు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మంత్రి రామనారాయణ రెడ్డి దృఢ సంకల్పం, ప్రత్యేక చొరవతో నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని చారిత్రాత్మక ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. శతాబ్దాల చరిత్ర కలిగిన శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునరుద్ధరించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఆదివారం చేజర్ల మండలంలోని పెరుమాళ్లపాడు, చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో రూ.5.50 కోట్ల వ్యయంతో మూడు ఆలయాల పునర్నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అదే సందర్భంగా చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభ స్వాగతం, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య జరిగిన కార్యక్రమాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ఆలయ అభివృద్ధికి సంకల్పం చేశారు.

పెరుమాళ్లపాడులో పెన్నా నది ఇసుక మేటల కింద వెలుగులోకి వచ్చిన చారిత్రాత్మక శ్రీ నాగేశ్వర స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని, గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలన్న మంత్రి ఆనం సంకల్పం, పట్టుదల కార్యరూపం దాల్చింది. శిథిలావస్థలో గుర్తించిన ఈ ఆలయాన్ని గొప్ప క్షేత్రంగా తయారు చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాటను ఆనం నిలబెట్టుకున్నారని గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల శివనామస్మరణల మధ్య నాగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లతో మంత్రి ఆనం భూమిపూజ నిర్వహించారు. సుమారు 200-300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన శైవక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావడంలో మంత్రి ఆనం వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ తీసుకోవడం విశేషం. అలాగే చేజర్ల, చిత్తలూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ.4 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా చిత్తలూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వైదిక సంప్రదాయాలకు శాశ్వత చిహ్నాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 684 పురాతన ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభించి రూ.808 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకం కింద 6,229 ఆలయాలకు రూ.75 కోట్ల నిధులు అందిస్తున్నామని, 988 ఆలయాలకు ట్రస్ట్ బోర్డులు నియమించగా మరో 412 ఆలయాలకు త్వరలో ట్రస్ట్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5 వేల భజన మందిరాల నిర్మాణానికి దాదాపు రూ.1,500 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 1,269 భజన మందిరాలకు రూ.216.45 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ, ధూపదీప నైవేద్యం, శ్రీవాణి, సీజీఎఫ్ఎల్ వంటి కార్యక్రమాల ఫలితంగానే ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరిగిందన్నారు. ఇప్పటివరకు ఆలయాల్లో ప్రసాద వితరణ ద్వారా 3 కోట్ల మంది భక్తులు లబ్ధి పొందగా, ప్రతి నెల 24 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారని తెలిపారు. మరో 111 ఆలయాల్లో అన్నప్రసాద పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.

విజయవాడ, శ్రీశైలం తిరుమల వంటి ప్రధాన పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీ గతంతో పోలిస్తే భారీగా పెరిగిందని పేర్కొన్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి తీరం వెంబడి ఉన్న 52 ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతులు వేగంగా చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఆలయ నిర్మాణం ప్రభుత్వ ధర్మమైతే, వాటిని పరిరక్షించి భక్తితో సజీవంగా ఉంచడం ప్రజల బాధ్యత అని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్న ప్రతి పురాతన ఆలయాన్ని గుర్తించి పునరుద్ధరిస్తామని, భావితరాలకు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వైభవాన్ని అందించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఆనం స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, దేవాదాయ శాఖ సిబ్బంది, పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు

## మైనార్టీల అభివృద్ధికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

- ఖబరిస్తాన్‌ల అభివృద్ధికి రూ.1.21 కోట్ల నిధుల మంజూరు హర్షణీయం
- మచిలీపట్నంలో మంత్రి కొల్లుకు కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీ నేతలు



మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మైనార్టీల ప్రార్థనా మందిరాలు, ఖబరిస్తాన్‌ల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.1,21,62,492 విలువైన పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీం బెగ్, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ అజీమ్ నేతృత్వంలో ఆదివారం పలువురు మైనార్టీ నాయకులు మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.. మచిలీపట్నం నియోజకవర్గంలో మైనార్టీల అవసరాలను గుర్తించి, పనుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి కొల్లు రవీంద్రకు ధన్యవాదాలు తెలియజేశారు. మత సామరస్యాన్ని పరిరక్షిస్తూ, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయం అన్నారు. ప్రార్థనా మందిరాలు, ఖబరిస్తాన్‌ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడమే మైనార్టీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అబు తాలిబ్ మీర్జా మైనార్టీ నాయకులు సయ్యద్ ఖాజా, ఫిరోజ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మావిగన్ జగన్‌కు ఆ 11 సీట్లు కూడా రావు

### - మంత్రి సంధ్యారాణి ఎద్దేవా



అమరావతి (చైతన్యరథం): నిలకడ లేని మనస్తత్వంతో రోజుకో మాట మాట్లాడుతున్న జగన్ రెడ్డిని చూసి సొంత పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమశాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గొడ్డలి పార్టీ అధినేత మావిగన్ మాటలు నిలకడలేనివని ఎద్దేవా చేశారు. తల్లి, చెల్లిని గెంటేసి చిన్నాన్న హత్య నిందితులపై చర్య తీసుకోని జగన్‌ను మనిషిగా పరిగణించలేం. జగన్ కంటే సీనియర్ నేతలు ఉత్తరాంధ్ర నుంచి బొత్స, ధర్మాన లాంటి వారు గొడ్డలి పార్టీ లో ఉన్నా... నిలకడలేని మాటల వల్లే జరిగే నష్టం గురించి ఎందుకు చెప్పలేకపోతున్నారో అని సందేహం వ్యక్తం చేశారు. విశాఖ రాజధాని అని ఎన్నికలకు వెళ్తే ఆ చుట్టు పక్కల ఎవ్వరూ ఓటేయకపోవటంతో జగన్ మాటలు ప్రజలు నమ్మడం లేదని స్పష్టమవుతోంది. నిలకడ లేని మాటలు మాట్లాడే వ్యక్తిని జనం పిచ్చివాడిగా పరిగణిస్తారన్నారు. జగన్ తాను పిచ్చోడినని చెప్పుకుంటున్నాడా.. లేక ప్రజల్ని పిచ్చోళ్లని చేద్దాం అనుకుంటున్నాడా తెలియటం లేదన్నారు. 11 సీట్లు వచ్చినా బుద్ధి రాలేదన్నట్లు మావిగన్ మేనిఫెస్టోతో వెళ్తే జగన్‌కు ఈ 11 సీట్లు కూడా మిగలవని మంత్ర సంధ్యారాణి హితవు పలికారు.

## అభివృద్ధిపై చర్చిద్దాం.. దమ్ముంటే రండి

### - వైసీపీకి మంత్రి సవిత సవాల్



రొద్దం (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించేందుకు గొడ్డలి పార్టీ నేతలకు ధైర్యం ఉంటే ముందుకు రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సవాల్ విసిరారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, బీదానపల్లి నుంచి కంబాలపల్లి వరకు రూ.2.80 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్ ను ఆదివారం మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వాస్తవాలతో మాట్లాడాలన్నారు. అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. మాటలతో కాలక్షేపం చేసే రాజకీయాలు మావి కావు. చేసిన అభివృద్ధి కనిపించకపోతే కళ్లకు గంతలు కట్టుకున్నట్టే. పెనుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి. మేము చేసిన పనులే మా బలం, ప్రజలే మా న్యాయనిర్ణేతలు అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లో నేడు కోట్ల రూపాయలతో రోడ్లు, తాగునీటి పథకాలు, విద్యా సంస్థలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నదాత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వెల్లడి




ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని పొందూరు మండలం కింతలి గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాని రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరు తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల భూములకు శాశ్వత గుర్తింపు కల్పించడంతో పాటు భూ యాజమాన్య హక్కులకు మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందన్నారు. ఈ పాస్ పుస్తకాలు రైతులకు చట్టపరంగా మరింత బలాన్ని ఇవ్వడమే కాకుండా భూములకు సంబంధించిన అన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఉపయోగపడతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెవెన్యూ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల రికార్డుల నిర్వహణలో సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారం, రికార్డుల నవీకరణ, వారసత్వ మార్పులు, ఇతర రెవెన్యూ సేవలను సకాలంలో అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవ గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిగురుపల్లి రామ్మోహన్, టిడిపి సెక్రెటరీ సీపాన శ్రీ రంగనాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నేపు రాము , బాడన శేషగిరి, చిన్న రంగ , బలగ శంకర్ భాస్కర్ , బీసీ అధ్యక్షులు చింతాడ వాసు, ఎంపిటిసి హనుమంతరావు, కూటమి ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కొండములగాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన బొంతు అప్పలనాయుడు మాస్టారు అభినందన సభలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాస్టారు దంపతులకు ఎంపీ శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అందించే సేవలు సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. వారి పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి మార్గదర్శకులుగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య

జగ్గయ్యపేట పట్టణం, జగ్గయ్యపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.20,76,952 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఉ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తన నివాసంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూపేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారిన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. జగ్గయ్యపేట పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని, వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తమ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి, అర్హులైన ప్రతి బాధితుడి తరపున ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేసినట్లు తెలిపారు.తమ సిఫార్సుల మేరకు ప్రభుత్వం స్పందించి మొత్తం రూ.20,76,952 మంజూరు చేయడం సంతోషకరమని, ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు కొంత ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తాము అందుబాటులో ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. అర్హులైన ప్రతి బాధితుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, ఇరి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, బొల్లినేని అప్పారావు,దేవరశెట్టి ప్రసాద్, వేదులాపూరి సైదా, కర్ల జోజి ,షేక్ ఖాసీం,కనుకుర్తి శ్రీనివాసరావు, మారేపల్లి శౌరి, మారేపల్లి బాషా, షేక్ అక్బర్, షేక్ మదార్, గుగులోతు హుస్సేన్, షేక్ ఉమ్మర్, తాళ్లూరి రమణ, చాడా శ్యామ్ సుందర్ రెడ్డి, పల్లెబోయిన నాగరాజు, వల్లెపు శ్రీను,వెంకటేశ్వర్లు,గుగులోతు సోమ్లా నాయక్, చక్కా జగన్నాథం, పున్నా ఉపేంద్ర, ముళ్ళపూడి అప్పారావు, చిలుకూరి కార్తీక్ ,ఇూ తండా నెంబర్ శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



# అదిగో అభివృద్ధి కళ్లుంటే చూడండి

## నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూపిస్తూ వైసీపీ నాయకులకు సవాలు విసిరిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మానేసి, వాస్తవాలతో మాట్లాడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. సత్యసాయి జిల్లా రొద్దం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు ప్రారంభించారు. బీదానపల్లి నుంచి కంబాలపల్లి వరకు రూ.2.80 కోట్లతో బీటీ రోడ్ ను ప్రారంభించారు.. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. మాటలతో కాలక్షేపం చేసే రాజకీయాలు మావి కావు. చేసిన అభివృద్ధి కనిపించకపోతే కళ్లకు గంతలు కట్టుకున్నట్టే. పెనుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి. మేము చేసిన పనులే మా బలం, ప్రజలే మా న్యాయనిర్ణేతలు అని అన్నారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లో నేడు కోట్ల రూపాయలతో రోడ్లు, తాగునీటి పథకాలు, విద్యా సంస్థలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు (చైతన్యరథం): కష్టకాలంలో ఉన్న పేదలను సీఎంఆర్ఎఫ్ ఫండ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,06,407/- విలువైన చెక్కులను వారి నివాసాలకు స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేతిన నారాయణ, కాకర్ల నారాయుడు, సూరపని చిన్ని గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కలియుగ ప్రత్యక్ష దైవం ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

ద్వారకాతిరుమల (చైతన్యరథం): కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ఆకాంక్షించారు. ఆదివారం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానాన్ని కుటుంబ సమేతంగా సందర్శించిన ఆయన స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవస్థాన సంప్రదాయాల ప్రకారం వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందించి, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులు, యువత, మహిళలు, ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# దివిసీమ ప్రగతి ప్రదాత మండలి వెంకట కృష్ణారావు

## తలశిల జనార్ధనరావు ఘననివాళి



అవనిగడ్డ (చైతన్యరథం): దివిసీమ సమగ్ర ప్రగతి ప్రదాతగా మండలి వెంకట కృష్ణారావు ఖ్యాతి గడించారని దివిసీమకు చెందిన రాజమండ్రిలో స్థిరపడిన ప్రముఖ వ్యాపారవేత్త తలశిల జనార్ధనరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి తలశిల జనార్ధనరావు, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, మోపిదేవి మండలం గంజివానిపల్లి వాసులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ప్రతినిధులు, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి బండే రాఘవ, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు మాదివాడ రత్నారావు, యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), యర్రంశెట్టి సుబ్బారావు, మోపిదేవి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, దేవస్థానం డైరెక్టర్లు అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, మత్తి శివపార్వతి, నీటి సంఘ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, నాయకులు బండే రాఘవ, గుడివాక శివరావు, సిద్దినేని అశోక్ నాయుడు, బచ్చు శ్రీహరి, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీను, రేపల్లె కృష్ణమూర్తి, కోసూరు పూర్ణచంద్రరావు, అడబాల వేణుగోపాలరావు, మండలి రామ్మోహనరావు, బొప్పన కాశీ విశ్వేశ్వరరావు, పులిగడ్డ బాలు శ్రీనివాస్, బడే సుబ్బారావు, చెన్ను శివాజీ, ముళ్లపూడి శ్రీనివాసరావు, మొగల్ మురాద్ బేగ్, భోగాది బాలకృష్ణ, సోమిరెడ్డి, నారేపాలెం శంకరరావు, సిద్దాబత్తుని హరినాథబాబు, మైలా హరిబాబు, కొండవీటి పాండురంగారావు, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, పసి, వాహేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో హరిత ఇంజినీరింగ్ వర్క్స్ ప్రారంభం

## కార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు


బాపులపాడు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హరిత ఇంజినీరింగ్ వర్క్స్ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమను ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. హరిత ఇంజినీరింగ్ వర్క్స్ యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని, స్థానికులకు అధిక సంఖ్యలో ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# స్వచ్ఛంద సేవే సమున్నతంగా నిలుస్తుంది

## అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెల్లడి

కోడూరు (చైతన్యరథం): స్వచ్ఛంద సేవ సమున్నతంగా నిలుస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం కోడూరు మండలం పోటుమీద గ్రామంలో ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ కడవకొల్లు పూర్ణచంద్రరావు జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పూర్ణచంద్రరావు స్మృతిలో వారి సతీమణి శిఖరం గాయత్రి, కుమారుడు కడవకొల్లు పాసత్ సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం మంచి ఆలోచన అన్నారు. అత్యవసర శస్త్రచికిత్సల సమయంలో, రోడ్డు ప్రమాద బాధితులకు, రక్తహీనతతో బాధపడే వారికి అత్యవసరంగా నిలిచి ప్రాణాలు కాపాడే రక్తాన్ని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ దానం చేయటం సామాజిక బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, గ్రామ ప్రముఖులు, నాయకులు, శిబిర నిర్వాహకులు పాల్గొన్నారు.



# జీవీ మా అన్నయ్య!

## వినుకొండ సభలో మంత్రి గుమ్మడి సంధ్యా రాణి



వినుకొండ (చైతన్యరథం): రాజకీయాలు అంటేనే విమర్శలు, ప్రతివిమర్శలతో వేడెక్కే వాతావరణం కనిపిస్తుంది. కానీ, వినుకొండ మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన ప్రభుత్వ గురుకుల బాలుర పాఠశాల భవన ప్రారంభోత్సవ సభలో మాత్రం సరికొత్త, అరుదైన ఆత్మీయ దృశ్యం ఆవిష్కృతమైంది. ఒకరు రాష్ట్ర మంత్రి, మరొకరు ప్రభుత్వ చీఫ్ విప్... కానీ ఆ వేదికపై వారిద్దరూ ప్రజాప్రతినిధులుగా కాకుండా, కల్మషం లేని 'అన్నా-చెల్లెళ్లు'గా సంబోధించుకుంటూ సభలో సరికొత్త జోష్ నింపారు. రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ...

"జీవి ఆంజనేయులు గారు మా అన్నయ్య.. అసెంబ్లీలో మేమిద్దరం పక్కపక్కనే కూర్చుంటాం. ఎప్పుడు కలిసినా ఎంతో ఆప్యాయంగా 'చెల్లెమ్మా' అని పలకరిస్తారు" అంటూ తమ అనుబంధాన్ని పంచుకోవడంతో సభ చప్పట్లతో మారుమోగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీలోని మహిళా ప్రజాప్రతినిధులందరికీ అన్నగా పట్టుచీరలు, పసుపు, కుంకుమలు ఇచ్చి గౌరవించిన జీవి ఆంజనేయుల మంచితనమే ఆయనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిందని ఆమె కొనియాడారు. వినుకొండకు నాయకుడు కాదు, ఒక మంచి సేవకుడు దొరికాడని, శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు అమోఘమని మంత్రి ప్రశంసించారు. వినుకొండ నియోజకవర్గానికి తన శాఖల తరపున ఎప్పుడు ఏ అవసరమున్నా అన్ని విధాలా అండగా ఉంటానని 'చెల్లెలి'గా అభయమిచ్చారు. మంత్రి ఆత్మీయతకు అంతే సమానంగా స్పందించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు... "మా చెల్లెమ్మ సంధ్యారాణి చాలా మంచి మనసున్న వ్యక్తి. పిలవగానే ఆదివారం అని కూడా చూడకుండా వినుకొండకు విచ్చేశారు" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కేవలం భవనాన్ని ప్రారంభించడమే కాకుండా, పాఠశాలలో డార్మెటరీ తదితర వసతులు కల్పిస్తానని ఆమె భరోసా ఇవ్వడం వినుకొండ ప్రజల అదృష్టమన్నారు. కూటమి ప్రభుత్వంలో తామంతా ప్రజాప్రతినిధులుగా కాకుండా, ఒకే కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ప్రజాసేవలో ముందుకు సాగుతున్నామని ఈ 'అన్నా-చెల్లెళ్ల' సంభాషణ ద్వారా వారు నిరూపించారు.



# స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

## విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వెల్లడి

విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 63వ,డివిజన్ సుందరయ్య నగర్‌లో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు కాలువలు, కల్వర్ట పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అత్యవసరంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 10 రోజుల వ్యవధిలోనే పనులను పూర్తి చేసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ సంకల్పమని, కాలువలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతాయని చెప్పారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, ప్రధాన కార్యదర్శి కోలా శ్రీను, లబ్బా దుర్గా, దుర్గాసి రాము, ఆంజనేయులు, ూని మెహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య నియోజకవర్గంగా గుంటూరు పశ్చిమ

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడి



గుంటూరు (చైతన్యరథం): తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు. ఆదివారం గుంటూరు 20వ డివిజన్ నల్లచెరువు 23వ లైన్ లో వికాస్ హాస్పిటల్, శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపును గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గత సంవత్సరం నుంచి ప్రతి డివిజన్, ప్రతి ప్రాంతంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలను వారి ఇంటి వద్దకే తీసుకువెళ్తున్నామని, ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని నేరుగా ఆసుపత్రులకు రిఫర్ చేసి అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. శస్త్రచికిత్సలు లేదా ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్.ఓ.సి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, వాస్కులర్ సర్జరీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలు అందించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, ల్యాబ్ టెస్టులు సహా పలు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వికాస్ హాస్పిటల్స్ సహకారంతో 70కు పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు, మందులు అందించడం ద్వారా ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

గుండె, డయాబెటిస్, బీపీ, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి అక్కడికక్కడే ఉచిత మందులు అందించామని చెప్పారు. వాస్కులర్ సమస్యలతో బాధపడుతున్న కొందరిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ల్యాబ్ పరీక్షలను కూడా శిబిరాల్లోనే ఉచితంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. 20వ డివిజన్ ప్రాంతంలో ముఖ్యంగా మధుమేహం, మోకాళ్ల నొప్పులు, దంత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు ఈ శిబిరం ద్వారా గుర్తించామని, భవిష్యత్తులో ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. శిబిరానికి వచ్చిన వారిని కేవలం పరీక్షలు చేయించి పంపించడం కాకుండా పూర్తిగా కోలుకునే వరకు ఫాలో అప్ చేసే వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఏడాది ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో ఇప్పటికే ఒక విడత ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని, ప్రస్తుతం రెండో విడత కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలు, మహిళలు, వృద్ధులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు కాలువలు, రోడ్ల వంటి మౌలిక వసతుల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20వ డివిజన్‌లో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టి అనేక రోడ్లు, కాలువలు నిర్మించామని, మిగిలిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నల్లచెరువు, 20వ డివిజన్ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు చిన్నారులను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన వికాస్ హాస్పిటల్ యాజమాన్యం, శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షుడు ఇమ్రాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వైద్య బృందానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

## సివిల్ సప్లయిస్ డైరెక్టర్లకు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పిలుపు

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 59వ డివిజన్‌కు చెందిన బుదాల సురేష్ బాబు, కేశవరపు సాంబశివరావు, నల్లమట్టి కామేశ్వరరావులను సివిల్ సప్లై డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నియామక పత్రాలను ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

నియామక పత్రాలు అందుకున్న బుదాల సురేష్ బాబు, కేశవరపు సాంబశివరావు, నల్లమట్టి కామేశ్వరరావు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ నేతలకు భగవద్గీత వెంకయ్య నాయుడు

## కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుభాకాంక్షలు

వెంకటాచలం (చైతన్యరథం): నెల్లూరుకి దేశవ్యాప్తంగా గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో వెంకయ్య నాయుడు గారి ఆత్మకథ 'వెంకయ్య నాయకుడు' పుస్తక పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరులో ఈ అద్భుతమైన కార్యక్రమం జరగడం, అందులో తాను భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో జాతీయ నాయకుడిగా, దేశంలోనే రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతిగా ఎదిగిన వెంకయ్య నాయుడు గారి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం అసాధారణమైందన్నారు. 1978లో పార్టీకి పెద్దగా గుర్తింపు లేని రోజుల్లో, చేతిలో రూపాయి లేకుండా, ఉదయగిరి నియోజకవర్గ బరిలో నిలిచి ఘనవిజయం సాధించారని గుర్తుచేశారు. ఆనాడు నెల్లూరు జిల్లాలో ఇందిరా కాంగ్రెస్ ప్రభంజనంలో 11 సీట్లకు గానూ 10 సీట్లు గెలిస్తే.. ఆ ఒక్క సీటును ఒంటిచేత్తో గెలిచి చూపించిన నాయకుడు వెంకయ్య నాయుడు అని చెప్పారు.

### అజాతశత్రువు

రాజకీయాలను, వ్యక్తిగత సంబంధాలను పాలు, నీళ్లలా వేరు చేసి చూడగల అరుదైన నేర్పు వెంకయ్య నాయుడు గారి సొంతమని, అందుకే ఇంతటి సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆయనకు శత్రువులంటూ ఎవరూ లేరని ప్రశాంతి రెడ్డి కొనియాడారు. ఆయన నిరంతరం చెప్పే సూత్రాలు నేటి తరం రాజకీయ నాయకులకు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. తనకు పెద్దగా రాజకీయ అనుభవం లేకపోయినప్పటికీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన ఆత్మీయతను ఒక కుటుంబ సభ్యురాలిగా పొందడం తన జీవితంలో మరువలేనిదన్నారు.'20 ఏళ్ల అనుభవం నేర్పే పాఠాలను.. ఏడాది గ్రంథ పఠనం నేర్పుతుంది' అనే నానుడిని గుర్తుచేస్తూ.. సీనియర్ జర్నలిస్ట్ శర్మ రచించిన ఈ ఆత్మకథ సమాజంలో ఏ రంగంలో ఉన్నవారికైనా అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత రాజకీయాల్లో ఉన్నవారికి, భవిష్యత్తులో రావాలనుకునే వారికి ఈ పుస్తకం ఒక 'భగవద్గీత' లాంటిదని స్పష్టం చేశారు. ఏ పదవిలో ఉన్నా పుట్టిన నేలను, మాతృభాషను వెంకయ్య నాయుడు మరువలేదని, స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా నెల్లూరులో అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని తెలిపారు. దేశానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2024లో దేశంలోనే రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మవిభూషణ్' తో గౌరవించడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ అద్భుతమైన పుస్తకాన్ని అందించిన రచయిత సీనియర్ పాత్రికేయులు మా శర్మని, దీపాను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు పలువురు గౌరవ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు పాల్గొన్నారు.







నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే, జనసేన పార్టీ జిల్లా పరిశీలకులు బొమ్మిడి నారాయణ నాయకర్ బొమ్మిడి నారాయణ నాయకర్ కు ఆత్మీయ ఆహ్వానం పలికిన సోమిరెడ్డి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో పాటు రాజకీయ అంశాలపై చర్చించుకున్న ఇరువురు నేతలు

# రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ

దర్శి (చైతన్యరథం): న్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను దర్శి మండలం, రామచంద్రాపురం గ్రామంలో రైతులకు దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మండల ఇంచార్జ్ తహసీల్దార్ రజిని, దర్శి అగ్రికల్చర్ ఏ.ఓ. అనురాధ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ లో ప్రజల ఆస్తులపై హక్కు సాధించి దోచుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రజల సాయంతో కూటమి తిప్పికొట్టిందన్నారు. అధికారంలోకి రాగానే ఆ యాక్టివ్ రద్దు చేస్తామని, రాజకీయ పార్టీ నేతల ఫోటో తో ఉన్న పాస్ పుస్తకాలు కూడా రద్దు చేసి కొత్తవి ఇస్తామని దర్శిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేస్తూ తొలి సంతకం చేశారన్నారు. రాజముద్రలతో పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రివర్యులు రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రైతులకు రాష్ట్ర రాజముద్ర, క్యూఆర్ కోడ్ బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కూడిన అత్యాధునిక, ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తోందన్నారు. ఇవి భూముల యాజమాన్యానికి శాశ్వత హక్కులను కల్పిస్తాయి.్న గత ప్రభుత్వంలో జగన్ ఫొటోలతో భూమి హక్కు పత్రాల పంపిణీ చేశారన్నారు. నాటి ప్రభుత్వ చర్యలపై ప్రజల అసంతృప్తి నేపథ్యంలో రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్నామన్నారు.్న గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి... పాస్‌పుస్తకాలపై నాటి పాలకులు జగన్ బొమ్మతో ఉన్న పాస్‌పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న పుస్తకాల పంపిణీపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు.లి భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే మన కూటమి ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.బిబిబిబితదుపరి వ్యవసాయ శాఖా అధికారులు రైతులకు ా=జీ 133-33 రకం కందులు 4న్ర్త ల బ్యాగ్ ని ఐతీ. గొట్టిపాటి లక్ష్మీ గారి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ లో దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి, దొనకొండ మండలాల టిడిపి అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పిచ్చయ్య, జిల్లా టిడిపి కార్యవర్గ సభ్యులు వల్లెపు నారాయణ, టిడిపి నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, సానే సుబ్బయ్య, నీటి సంగం అధ్యక్షులు ఎలుగోండారెడ్డి, రామచంద్రపురం గ్రామ టిడిపి నాయకులు మండలంలోని కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# ఆదర్శ రాజకీయాలకు చెరగని చిరునామా వెంకయ్య నాయుడు

## మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకుడు కిషోర్ గునుకుల



వెంకటాచలం (చైతన్యరథం): నెల్లూరు ముద్దుబిడ్డ, భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి, మాజీ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, మాజీ పట్టణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన శాఖా మంత్రి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత వెంకయ్య నాయుడును జనసేన నాయకుడు కిషోర్ గునుకుల స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధి, ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయాలు, యువత సమాజ నిర్మాణంలో పోషించాల్సిన బాధ్యత, ప్రజాప్రతినిధులు అనుసరించాల్సిన నైతిక విలువలు తదితర అంశాలపై ఆత్మీయంగా చర్చించినట్లు కిషోర్ గునుకుల తెలిపారు. దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో విశిష్ట సేవలందించిన వెంకయ్య నాయుడు గారు తన అనుభవాలను పంచుకుంటూ, ప్రజలతో నిరంతరం మమేకమై సేవాభావంతో పనిచేస్తేనే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలమని సూచించినట్లు ఆయన వెల్లడించారు. యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని, విలువలతో కూడిన ప్రజా జీవితం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని వెంకయ్య నాయుడు సూచించినట్లు తెలిపారు. వెంకయ్య నాయుడు స్ఫూర్తిదాయకమైన మాటలు, విలువైన సూచనలు తనలో మరింత బాధ్యతను పెంచాయని, వారి ఆశీస్సులు పొందడం తన ప్రజా జీవితంలో ఒక గౌరవప్రదమైన సందర్భంగా భావిస్తున్నట్లు కిషోర్ గునుకుల పేర్కొన్నారు. ప్రజాసేవనే పరమావధిగా తీసుకుని, జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా కిషోర్ గునుకుల తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు ఆంజనేయ రెడ్డితో పాటు జనసేన నాయకులు కిషోర్ గునుకుల, ప్రశాంత్ గౌడ్, నాగేంద్రబాబు, హేమచంద్ర యాదవ్, పవన్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, శరవణ పాల్గొన్నారు.

# అర్హులందరికీ పక్కాగా ఇళ్లు నిర్మిస్తాం

## పీఎం ఆవాస్ యోజన పథకంపై అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడు (చైతన్యరథం): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంపై సమీక్ష చేశారు. ఇప్పటి వరకు ఇళ్లు లేని వారు ఎంత మంది ఉన్నారు.. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు.. వంటి అంశాల గురించి ఆరా తీశారు. రాప్తాడు నియోజకవర్గంలోని 6మండలాల్లో సుమారు 11వేల మంది లబ్ధిదారులను ప్రాథమికంగా అర్హులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు గ్రామసభలు నిర్వహించి.. లబ్ధిదారులను గుర్తించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత సూచించారు. ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. గత ప్రభుత్వంలో లాగా ఎక్కడా పార్టీలు చూడమని.. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఇళ్లు లేని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత వివరించారు.



పెనుకొండలో జరిగిన పాసుపుస్తకాల పంపిణీలో పాల్గొన్న మంత్రి సవిత



## నిర్విఘ్నంగా యోగా శిక్షణ తరగతులు

పెనమలూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు రెండో రోజు కూడా ఉత్సాహంగా కొనసాగాయి,ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్వయంగా పాల్గొని యోగా ఆసనాలు చేస్తూ అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారికి వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం, శ్వాస వ్యాయామాలు, ధ్యాన విధానాలపై నిపుణులు శిక్షణ అందించారు, యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత అవసరమని,ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు,ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ యోగా శిక్షణ తరగతులను ప్రజలు,మహిళలు, యువత,పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# గొడ్డలి పార్టీ పాలనలో ఐదేళ్ల విధ్వంసం



కళ్యాణదుర్గం (చైతన్యరథం): విధ్వంసం, వినాశకరమే పరమావధిగా గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలన సాగించిందని కళ్యాణదుర్గ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. అప్పటివరకు నిర్మాణ దశలో ఉన్న 102 సాగునీటి ప్రాజెక్టులను జీవో 365 తెచ్చి రద్దు చేశారని విమర్శించారు. హంద్రీనీవా కరెంట్ బిల్లులు కట్టలేదన్నారు. శ్రీశైలం మరమ్మతులకు, తుంగభద్ర ప్రాజెక్టు నిర్వహణకు నిధులు ఇవ్వలేదన్నారు. 2021లో కడప జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు కోల్పోయినా స్పందించలేదన్నారు. పారిశ్రామికవేత్తలను గొడ్డలి పార్టీ నాయకులు బెదిరించడంతో 19 కియా అనుబంధ సంస్థలను, అమర్ రాజా కంపెనీని సీమ నుంచి తరిమేశారన్నారు. రాయలసీమ ఎత్తిపోతల అంటూ నాటకాలాడారు. 2021 లోనే ఎన్ టి జి ప్రాజెక్టును రద్దు చేసిందని దుయ్యబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల అంటూ నాటకాలాడారు. 2021 లోనే ఎన్ టి జి ప్రాజెక్టును రద్దు చేసిందన్నారు. రూ. 12 లక్షల కోట్ల బడ్జెట్ లో రూ. 2 వేల కోట్లు కూడా ఐదేళ్లలో జగన్ ఖర్చు చేయలేదు. సీమకు వరప్రదాయని అయినా డ్రిప్ ఇరిగేషన్ రద్దు చేసి రాయలసీమ రైతాంగానికి తీరని ద్రోహం చేసి జగన్ సీమద్రోహిగా మిగిలారన్నారు. అనంతపురంలో 6400 మందికి ఉపాధి ఇవ్వాల్సిన జాకీ దుస్తుల పరిశ్రమ వేరే రాష్ట్రానికి తరలిపోయిందని ఎద్దేవా చేశారు. తిరుపతిలో పెట్టాలనుకున్న రిలయన్స్ ఎలక్ట్రానిక్స్ మెగా ప్రాజెక్టును రద్దు చేసుకుని, భూములు వెనక్కి ఇచ్చేసిందన్నారు. అనంతపురంలో కియా కార్ల ప్లాంట్ కు విడిభాగాలు అందించే 19 అనుబంధ సంస్థలకు సంబంధించిన యూనిట్లు వెనక్కి వెళ్ళాయన్నారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ అభివృద్ధి కుంటుపడేలా గొడ్డలి పార్టీ పాలన సాగిస్తే.. నేడు కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రాయలసీమ ముఖచిత్రాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చివేసిందని పేర్కొన్నారు. గండికోట జలాశయం మైలవరం డ్యాం నుండి 2 టీఎంసీల నీరు. రూ.40 కోట్లతో చీఎ-67 నుండి స్టీల్ ప్లాంట్ కు 12 కిలోమీటర్ల మేర 4 లైన్ల యాక్సెస్ రోడ్డు. ముద్దనూరు రైల్వే స్టేషన్ నుండి 12 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ అనుసంధానం జరిగిందన్నారు. 268 మెగావాట్ల విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సబ్ స్టేషన్, జమ్మలమడుగు సబ్ స్టేషన్ నుండి 400 కె.వి డబుల్ సర్క్యూట్ ట్రాన్స్ మిషన్ లైన్ ల ఏర్పాటు. ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధి(కాపౌండ్ వాల్స్, 2000 ఖూ సంప్ నిర్మాణాలు జరిగాయన్నారు. స్టీల్ ప్లాంట్ కు అవసరమైన 1100 ఎకరాలను ఎకరా రూ. 5లక్షల చొప్పున, టౌన్ షిప్స్ ఏర్పాటుకు 200 ఎకరాలను జమ్మలమడుగులోని సున్నాపురాల్లపల్లెలో కేటాయింపు జరిగిందన్నారు. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్ లో రూ. 25 కోట్లను కూటమి కేటాయించిందన్నారు. జీఔ సంస్థతో కలసి ప్రాజెక్టును పట్టలకెక్కించెందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనులను పునఃప్రారంభించారన్నారు. మొదటి దశలో రూ. 4500 కోట్ల పెట్టుబడి పెడుతుండగా, రెండో దశలో రూ. 11,850 కోట్ల పెట్టుబడి పెడుతున్నారన్నారు. రెండు దశలు పూర్తయితే 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుందన్నారు. కర్మాగారాన్ని 2028 నాటికి పూర్తి చేసి రాయలసీమ ఉద్యోగాలు కల్పించనున్నామన్నారు.

### గ్రీన్ స్టీల్ ప్రత్యేకత

పర్యావరణానికి అనుకూలంగా కడప ఉక్కు పరిశ్రమలో ఉక్కు ఉత్పత్తి కానుందన్నారు. ఈ ప్లాంట్ సంప్రదాయ బొగ్గు ఆధారిత బ్లాస్ట్ ఫర్నేస్ విధానాన్ని కాకుండా స్క్రాప్ ఆధారిత ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ సాంకేతికతను ఉపయోగించనుందని దీనికి రెన్యూవబుల్ ఎనర్జీ వాడటాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం మరో 2000 ఎకరాలను జీఔ రెన్యూ ఎనర్జీ పేరుతో ప్రభుత్వం కేటాయించింది. దక్షిణ భారతదేశంలోనే తక్కువ కార్బన్ ఉద్గారాలతో 'గ్రీన్ స్టీల్' ఉత్పత్తి చేసే కేంద్రంగా కడప ఉక్కు కర్మాగారం నిలువనుంది. రాయలసీమ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు రాయలసీమ ప్రాంతంపై సామాజికంగా, ఆర్థికంగా ప్రభావం చూపిస్తుందన్నారు.

# విద్యాలయాలంటే దేవాలయాలు.. ఇక్కడ రాజకీయాలకు చోటులేదు!

## విద్యాకానుక కిట్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): విద్యాలయాలంటే దేవాలయాలని.. ఇక్కడ రాజకీయాలు ఉండకూడదన్నదే మా ప్రభుత్వ ఉద్దేశ్యమని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం పేరూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో ఆమె విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు కూడా పాల్గొన్నారు. గతంలో పాఠశాల అభివృద్ధికి తనవంతు లక్ష రూపాయలు ప్రకటించిన ఎమ్మెల్యే సునీత అందుకు సంబంధించిన నగదును అందజేశారు. ఆ తర్వాత విద్యార్థులకు ఎంజేపీ పాఠశాల సొసైటీ మొదటిసారిగా ట్రాక్ సూట్, ట్రాక్ షూస్ తో పాటు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుక కిట్లను అందజేశారు. విద్యార్థులకు అందించిన కిట్లను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. ప్రతి ఒక్కరూ దీనిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. అనంతరం పేరూరు కు చెందిన రామాంజినేయులు పదవ తరగతిలో 580 కి పైగా మార్కులు సాధించగా రూ. 10వేల చొప్పున పారితోషికం ప్రకటించారు. ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా విద్యార్థులకు ఆ నగదును అందజేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి కార్పొరేట్ కు ధీటుగా రాణించినందుకు వారిని అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ నసనకోట బాలికల పాఠశాల తరహాలోని ఇక్కడ కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ రెండు పాఠశాలలు జిల్లాకే కాకుండా రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు.

విద్య కోసం ఈ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని.. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో లాగా రాజకీయాలకు తావు లేకుండా విద్యా కానుక కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఉన్న నాయకులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సునీత పిలుపునిచ్చారు.



# హాంకాంగ్‌లో చిక్కుకున్న తెలుగు కుటుంబం



- వేగంగా స్పందించిన మంత్రి నారా లోకేష్
- విదేశాంగ మంత్రి దృష్టికి సమాచారం
- సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు



చైనా: హాంకాంగ్ విమానాశ్రయంలో తెలుగు కుటుంబం చిక్కుకోవడంపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ నుంచి షికాగో వెళుతూ పాస్‌పోర్టు పోగొట్టుకొని పిల్లలతో బొల్లా రాజేశ్వరి కుటుంబం హాంకాంగ్‌లో చిక్కుకుంది. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై లోకేష్‌కు రాజేశ్వరి కుటుంబసభ్యులు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 52 గంటలుగా చిన్న పిల్లలతో సాయం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబ పరిస్థితిపై వెంటనే లోకేష్ స్పందించారు. బాధితులకు తక్షణ సాయం అందించాల్సిందిగా విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కోరారు. మంత్రి లోకేష్ చొరవతో విదేశాంగశాఖ స్పందించింది. హాంకాంగ్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను సంప్రదించింది. సదరు కుటుంబంతో సంప్రదింపుల్లో ఉన్నామని భారత రాయబారి కార్యాలయం తెలిపింది. వీలైనంత త్వరగా సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించింది. వేగంగా స్పందించినందుకు భారత రాయబారి కార్యాలయానికి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి కొండపల్లి స్పందన: హాంకాంగ్‌లో చిక్కుకున్న తెలుగు కుటుంబంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. బాధితులకు తక్షణమే తాత్కాలిక పాస్‌పోర్టులు ఏర్పాటు చేసి సురక్షితంగా భారత్‌కు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.



## జాతిరత్నాలు సంగీత దర్శకుడి సందడి

జార్జియా: సూపర్‌హిట్ తెలుగు సినిమా 'జాతిరత్నాలు' సంగీత దర్శకుడు అనుదీప్ జార్జియాలోని ప్రముఖ స్వచ్ఛ శాఖాహార రెస్టారెంట్ తాజా కేఫ్‌లో సందడి చేశారు. స్నేహితులతో కలిసి కేఫ్‌ను సందర్శించిన ఆయన అక్కడ అందించే వివిధ రకాల దక్షిణ భారతీయ వంటకాలను ఆస్వాదిస్తూ గడిపారు. జాన్స్ క్రీక్‌లోని గణేష్ అలయానికి సమీపంలో ఉన్న తాజా కేఫ్, సంప్రదాయ దక్షిణ భారతీయ రుచులను స్వచ్ఛమైన శాకాహా ర పద్ధతిలో అందిస్తూ తెలుగు, భారతీయ కుటుంబాలకు ఎంతో ప్రీతి పాత్రమైన ఆహార కేంద్రంగా గుర్తింపు పొందింది. తాజా పదార్థాలతో తయారైన టిఫెన్లు, భోజనాలు, స్నాక్స్, పచ్చళ్లు, పొడులు వంటి ప్రత్యేక వంటకాలు ప్రత్యేక అకర్షణగా నిలుస్తున్నాయి. అనుదీప్ సందర్శన సందర్భంగా అభిమానులు, స్నేహితులు ఆయనతో ఆత్మీయంగా ముచ్చటించి ఫొటోలు దిగారు. ఆయన రాకతో తాజా కేఫ్‌లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తాజా కేఫ్ యాజమాన్యం వెన్నెల రామారావు మాట్లాడుతూ ప్రముఖ సినీ దర్శకుడు అనుదీప్ తమ కేఫ్‌ను సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రవాస భారతీయులు ముఖ్యంగా తెలుగు కుటుంబాలకు ఆత్మీయ వాతావరణంలో స్వదేశీ రుచులను అందిస్తున్న తాజా కేఫ్ జార్జియాలో భారత ఆహార ప్రియులకు ప్రముఖ గమ్యస్థానంగా కొనసాగుతోంది.

# సువిధ ఫౌండేషన్ గేట్ వే టు మెడిసిన్ క్యాంప్


- విద్యార్థులకు వైద్య రంగంపై వివిధ అంశాల్లో అవగాహన
- వైద్యనిపుణుల తయారీకి వినూత్న కార్యక్రమం



అమెరికా: కాలిఫోర్నియాకు చెందిన లాభాపేక్షలేని సేవా సంస్థ సువిధా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన 'గేట్‌వే టు మెడిసిన్' సమ్మర్ క్యాంప్ జూన్ 28, 29 తేదీల్లో గ్రానైట్ బే లైబ్రరీలో విజయవంతంగా నిర్వహించారు. 2025లో ప్రారంభమైన తొలి క్యాంప్‌కు వచ్చిన విశేష స్పందనతో ఈసారి మరింత విస్తృతంగా రెండురోజుల పాటు మొత్తం 12 గంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 40 మంది మిడిల్, హైస్కూల్ విద్యార్థులు పాల్గొని వైద్యరంగంపై అవగాహన పెంపొందించుకునే అవకాశాన్ని పొందారు. వైద్య నిపుణుల ప్రసంగాలు, ప్రత్యక్ష శిక్షణ, విద్యార్థుల మధ్య పరస్పర అభ్యాసం, అలాగే సీపీఆర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్ ఆరోగ్య రంగ నిపుణులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో క్లిష్టమైన వైద్య అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా బోధించారు. ఈ క్యాంప్ ప్రత్యేకత ఏమిటంటే దీనిని వైద్యరంగంలోకి అడుగుపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్న యువ విద్యార్థులే రూపొందించి నిర్వహించారు. గ్రానైట్ బే హైస్కూల్‌కు చెందిన శ్రీరామ్ వెంపాటి, అర్జున్ ధూలిపాళ, యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌లో చదువుతున్న అభిరామ్ ధూలిపాళ కలిసి శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. తమ విద్యా అనుభవాలను ఆధారంగా చేసుకుని కార్యక్రమాలను రూపొందించారు. సాక్రమెంటో, ఫోల్సమ్, రాంచో కార్డోవా, రోజ్‌విల్, రాక్‌లిన్, గ్రానైట్ బే, ఎల్క్ గ్రోవ్, ఎల్‌డొరాడో హిల్స్, షింగిల్ స్ప్రింగ్స్, ట్రేసీ ప్రాంతాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఒకే లక్ష్యంతో వైద్యరంగంపై ఆసక్తి కలిగిన విద్యార్థులు పరస్పరం పరిచయాలు పెంచుకుని అనుభవాలు పంచుకున్నారు.

### సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ

సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ క్యాంప్‌లో అత్యంత ఆకర్షణీయంగా నిలిచింది. నార్‌కాల్ ఎమర్జెన్సీ మెడికల్ ట్రైనింగ్ బృందం మూడుగంటల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. గుండెపోటు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి, ఛాతీపై ఒత్తిడి ఎలా చేయాలి, ప్రాణాలను ఎలా కాపాడాలనే అంశాలను ప్రాక్టికల్‌గా నేర్పించారు.






శిక్షణ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి అధికారిక సీపీఆర్ సర్టిఫికేట్ అందజేశారు. డాక్టర్ దీపిక గోషికే విద్యార్థులకు శస్త్రచికిత్సలో ఉపయోగించే స్యూటరింగ్ పద్ధతులను ప్రత్యక్షంగా నేర్పించారు. సింథటిక్ స్కిన్ ప్యాడ్లపై శస్త్రచికిత్స పరికరాలతో గాయాలకు కుట్లు వేయడం సాధన చేయించారు. బెలూన్లు, సాధారణ గృహోపకరణాలతో తయారు చేసిన ఊపిరితిత్తుల నమూనా ద్వారా శ్వాసక్రియ ఎలా జరుగుతుంది, ఊపిరితిత్తుల విస్తరణ, ఆస్తమా వంటి సమస్యలు ఎలా ఏర్పడతాయో విద్యార్థులకు సులభంగా వివరించారు. అలాగే రక్తపోటు కొలిచే పరికరాలు, స్టెతస్కోప్, పల్స్ ఆక్సీమీటర్ వంటి వైద్య పరికరాలను స్వయంగా ఉపయోగించే అవకాశం కల్పించారు. గుండె, ఊపిరితిత్తుల శబ్దాలను వినడం, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను కొలవడం వంటి అనుభవాలను పొందారు. మెడికల్ స్కావెంజర్ హంట్ పేరుతో నిర్వహించిన వినూత్న కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. థర్మామీటర్, స్టెతస్కోప్, ఓటోస్కోప్, సిరంజి, ఫోర్సెప్స్, ఈసీజీ యంత్రం, స్పైరోమీటర్, బ్యాండేజ్, బీపీ యంత్రం తదితర 18 వైద్య పరికరాలను వాటి ఉపయోగాలకు సరిపోల్చే పోటీ నిర్వహించారు. దీని ద్వారా వైద్య పరికరాలపై విద్యార్థులకు అవగాహన కలిగింది.

### వైద్య నిపుణుల సూచనలు

ఇంటర్నల్ మెడిసిన్ వైద్యురాలు శ్రీదేవి గారపాటి విజయవంతమైన వైద్యుడిగా ఎదగాలంటే వైద్య పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యం, కరుణ, సహానుభూతి, జట్టు భావన అవసరమని వివరించారు. క్లినికల్ కేసుల ఆధారంగా వైద్యులు ఎలా నిర్ణయాలు తీసుకుంటారో వివరించారు. డాక్టర్ అలోక్ కృష్ణ వ్యసన వైద్యశాఖ గురించి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వ్యసనానికి గురైన వారిని ఎలా అర్థం చేసుకోవాలి, యువత వ్యసనాలకు దూరంగా ఎలా ఉండాలో వివరించారు. డాక్టర్ అభిషేక్ రాయ్ మానసిక ఆరోగ్యం, ఆందోళన, డిప్రెషన్, బర్నౌట్ వంటి సమస్యలపై వివరించారు. కార్డియాలజిస్టు డాక్టర్ సంధ్యా వేణుగోపాల్ గుండె నిర్మాణం, గుండె జబ్బులు, నివారణ చర్యలు, గుండె పోటు సమయంలో తక్షణ వైద్యం ఎంత ముఖ్యమో వివరించారు. సమయానికి సీపీఆర్ అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. డాక్టర్ ప్రియా ఉపద్రష్ట దంత వైద్య రంగం, దంత ఆరోగ్యం ప్రాముఖ్యతపై వివరించారు. వైద్య విద్యార్థి విశ్రుత్ నాగం మెడికల్ కాలేజీలో ప్రవేశం వరకు తన ప్రయాణాన్ని, ఎంసీఏటీ పరీక్షలు, అడ్మిషన్ ప్రక్రియ, పట్టుదల ప్రాముఖ్యతను వివరించారు. వెంకట్ నాగం అమెరికాలోని బీఎస్/ఎండీ ప్రోగ్రామ్‌లపై ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యా ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సేవా కార్యక్రమాలు, పరిశోధన, వ్యక్తిగత వ్యాసాలు వంటి అంశాలు ప్రవేశాలకు ఎంత కీలకమో వివరించారు. సువిధా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు భాస్కర్ వెంపాటి శిబిరానికి సహకరించిన విద్యార్థులు, వాలంటీర్లు, వైద్యులు, తల్లిదండ్రులు, గ్రానైట్ బే లైబ్రరీ, నార్‌కాల్ ఎమర్జెన్సీ మెడికల్ ట్రైనింగ్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామ్ వెంపాటి, అభిరామ్ ధూలిపాళ, అర్జున్ ధూలిపాళ కూడా వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారాన్ని అభినందించారు.





# ముంబయి.. అతలాకుతలం!

**కుండపోత వానలు..**
**లోతట్టు ప్రాంతాల ముంపు**



భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఇంకా వర్షం కురిసే అవకాశం ఉండటంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకు రావొద్దని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అక్కడి ప్రజలను కోరింది. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల 20 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో 30 సెం.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు ముంబయిలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. అయితే, మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. వర్షం కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్ లైన్ నంబర్ 1916కి ఫోన్ చేసి చెప్పాలని బీఎంసీ అధికారులు సూచించారు. సముద్ర తీరప్రాంతంలో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగిసిపడే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. థానె, పాల్ఘర్, నవీ ముంబయి, పుణె ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మరికొన్నిచోట్ల రహదారులు నీట మునిగిపోయాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న వారిని అధికారులు, సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. విక్రోలిలో అత్యధికంగా 31.06 వర్షపాతం నమోదైంది.

**ముకేశ్ అంబానీ భద్రత కాన్వాయ్ ఎదుట కూలిన వృక్షం**

ప్రముఖ వ్యాపార వేత్త ముకేశ్ అంబానీ భద్రతా కాన్వాయికి పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ శివారులోని బంద్రా ప్రాంతంలో ఓ భారీ వృక్షం కాన్వాయ్ ఎదుట కూలిపోయింది. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులు చెట్టును తొలగించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# సహజవాయు సరఫరాపై ఆంక్షల ఎత్తివేత

**ప్రకటన విడుదల చేసిన కేంద్రం**



నేచురల్ గ్యాస్ సరఫరాపై అత్యవసర ఆంక్షలను కేంద్రం ఎత్తివేసింది. హర్మూజ్ జలసంధి ద్వారా ద్రవీకృత సహజవాయువు రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరడంతో.. అత్యవసర ఆంక్షలు ఎత్తివేసినట్టు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్‌జీ నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాంతో సరఫరా సంస్థలు 'ఫోర్స్ మేజర్' ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 9న కేంద్రం అత్యవసర నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దేశీయ గ్యాస్, దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని గృహ అవసరాలు, రవాణా రంగం (సీఎన్‌జీ), ఎల్పీజీ ఉత్పత్తి, ఎరువుల కర్మాగారాల వంటి కీలక రంగాలకు మాత్రమే కేటాయించింది. పెట్రోకెమికల్స్, విద్యుత్ ప్లాంట్ల వంటి ప్రాధాన్యత లేని రంగాలకు సరఫరాలో కోతలు విధించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో శాంతి చర్చలు జరుగుతుండటంతో సముద్ర మార్గంలో రవాణా సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో అత్యవసర చర్యలు ఇక అవసరం లేదని కేంద్రం పేర్కొంది. సంక్షోభ సమయంలో విధించిన మూడు అత్యవసర నిబంధనల్లో ఇది చివరిది. ఇప్పటికే రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలన్న ఆదేశాలను, బల్క్ డీజిల్ అమ్మకాలపై ఆంక్షలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాజా నిర్ణయంతో పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, ఇతర వినియోగదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఇకపై గ్యాస్ కేటాయింపులు సాధారణ వాణిజ్య ఒప్పందాల ప్రకారం కొనసాగుతాయి.

# నేడు అయోధ్య ట్రస్ట్ కీలక భేటీ

**నూతన పరిపాలనా వ్యవస్థ ఏర్పాటుపై చర్చ**



అయోధ్య రామాలయ విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక ప్రకటన చేసింది. సోమవారం ఆలయ ప్రధాన అధికారులు, అర్చకులు భేటీ అవ్వనున్నట్టు తెలిపింది. సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్.. ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై చర్చించనున్నట్టు సమాచారం. కాగా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్‌దాస్, ఆరోగ్య సమస్యల కారణంగా ప్రయాణించలేని స్థితిలో ఉన్న సీనియర్ ట్రస్టీ పరాశరన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజీనామాను ఆమోదిస్తే ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించడం, రామమందిర నిర్వహణకు సంబంధించి భవిష్యత్తులో తీసుకునే చర్యలు, నూతన పరిపాలన వ్యవస్థ ఏర్పాటువంటి వాటి గురించి సమావేశంలో చర్చించనున్నారు.

**ప్రతిపక్షాల ఆరోపణలను పరిశీలించాలి: విశ్వ హిందూ పరిషత్**

రామ మందిరంలో విరాళాల చోరీ గురించి ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను కూడా పరిశీలించాలని విశ్వ హిందూ పరిషత్ అయోధ్య పోలీసులకు లేఖ రాసింది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణల్లో ఏమైనా వాస్తవాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఆధారాలు, సమాచార మూలాలు, పత్రాలను వారినుంచి సేకరించాలని సూచించింది. నిందితులను పట్టించే ఏ విషయాన్నీ వదలకూడదని విజ్ఞప్తి చేసింది.

**బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్**

ముంబయి: అయోధ్య రామ మందిర విరాళాల వ్యవహారంలో శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే భారతీయ జనతా పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దోచుకుంటున్నవారే అధికారంలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. ముంబయిలో 'రామ రక్ష' పేరుతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అయోధ్య కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, కాశీ, మధుర ఇంకా మిగిలే ఉన్నాయని పేర్కొన్నారు. అక్కడ జరగబోయే దోపిడీ గురించి ఆందోళనగా ఉందన్నారు. 'మేం ధైర్యవంతులం. దేశభక్తి కలిగిన హిందువులం. కానీ మూర్ఖులం మాత్రం కాదు' అని ఉద్ధవ్ పేర్కొన్నారు.

## పాక్ రక్షణ మంత్రికి పిచ్చెక్కింది



ఢిల్లీ: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆయనకు మతి స్థిమితం లేదని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించింది. ఇటీవల ద్వీపదేశం సీషెల్స్‌లో పర్యటించిన ప్రధాని మోదీ.. ఆ దేశ అత్యున్నత గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరిజన్' పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఖవాజా ఆసిఫ్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అది రూపొందించుకున్న గౌరవం (కావాలని ఇప్పించుకున్న అవార్డు) అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఆయనకు పనేంలేదని, అవగాహనలేని అంశాలపై అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని వ్యాఖ్యానించింది. మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కౌంటర్ ఇచ్చారు. ఇతరులపై అసూయ ఎప్పటికీ మంచి చేయదని, చెడును ప్రేరేపిస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్వేషపూరిత ప్రసంగాలకు అలవాటు పడినవారిలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సీషెల్స్ అత్యున్నత పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిగా ప్రధాని మోదీ నిలిచారు. మోదీ పర్యటనకు కొద్ది వారాల ముందే అంటే జూన్ 24న గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరిజన్ పురస్కారానికి అక్కడి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## ప్రత్యక్ష పోరుకు ప్రశాంత్

**బీజేపీ కంచుకోటనుంచి బరిలోకి..**



ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలవబోతున్నారు. బిహార్‌లోని బంకీపూర్ స్థానంనుంచి పోటీ చేయనున్నారు. ఉప ఎన్నిక కోసం ప్రశాంత్ కిశోర్‌ను అభ్యర్థిగా నిలబెడుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతీ వెల్లడించారు. ఈనెల 30న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఆగస్టు 3న ఫలితాలను ప్రకటించనున్నారు. గత ఎన్నికల్లో ఈ స్థానంనుంచి భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నితిన్ నబీన్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. భాజపాకు కంచుకోట అయిన ఈ స్థానానికి ఆ పార్టీ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ఎన్నికల వ్యూహకర్తనుంచి రాజకీయ పార్టీని స్థాపించిన ప్రశాంతికిశోర్ గత ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని ఎదురుచూశారు. తాను పోటీ చేయకపోయినప్పటికీ తన పార్టీ జన్ సూరాజ్ తరపున పోటీ చేసిన ఒక్క అభ్యర్థినీ గెలిపించలేకపోయారు. 249 స్థానాలకుగానూ 238 సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ ఒక్కసీటులోనూ ఆ పార్టీ గెలవలేకపోయింది. దీంతో అప్పట్లో ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనవ్రతం కూడా చేశారు. దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల కోసం మూడు రోజుల క్రితం కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జులై 6న నోటిఫికేషన్ విడుదల కానుంది.

## సీఎంను కించపర్చేలా రీల్స్..

**ఒడిసాలో యువకుడి అరెస్ట్**

ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝిని కించపరిచేలా రూపొందించిన ఏఐ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కటక్‌కు చెందిన బిశ్వజిత్‌గా గుర్తించారు. అతడిపై సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ విభాగం రోజువారీ తనిఖీల్లో భాగంగా సోషల్ మీడియాను పరిశీలించిన క్రమంలో అతడు సీఎంను కించపరిచేలా అసభ్యకర వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నట్టు బహిర్గతమైంది. "ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకొని నిందితుడు ఏఐతో రూపొందించిన ఫొటోలు, రీల్స్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నట్టు గుర్తించాం. సీఎంను కించపరిచేలా నిందితుడు కొన్ని అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. ఇవి వైరల్ కావడంతో అరెస్టు చేశాం" అని పోలీసులు వెల్లడించారు. తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని సోషల్ మీడియా యూజర్లను పోలీసులు హెచ్చరించారు.

చైతన్యరథం

# నేను మూడోసారి అధ్యక్షుడిని!



### అమెరికా స్వాతంత్ర్య వేడుకల సభలో ట్రంప్ ప్రగల్భాలు - వివాదాస్పద వ్యాఖ్యల జోలికి పోనంటూ వెటకారం..

వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఇది మూడోసారి అని చెప్పుకొన్నారు. నిజానికి ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం రెండోసారి. అయినప్పటికీ.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ తన విజయాన్ని దోచుకున్నారని ఆయన పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. దానిని కూడా తన ఖాతాలో వేసుకొని మూడోసారి అధ్యక్షుడిని అని అన్నారు. అంతలోనే నవ్వుకుంటూ వివాదాస్పద అంశాల జోలికి పోవాలనుకోవట్లేదంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదిగిందంటే.. అది అనుకోకుండా జరిగిందేమీ కాదని ట్రంప్ అన్నారు. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు దేశ సైన్యాన్ని పునర్నిర్మించినట్లు చెప్పారు. దేశ సైనిక సామర్థ్యాలను పెంపొందించడానికి తాను చేసిన కృషిని ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. ఈ క్రమంలోనే.. 2020 అధ్యక్ష ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకించిన ట్రంప్.. 'నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్టు లెక్క కానీ, వివాదాల జోలికి వెళ్లకూడదనుకుంటున్నాను కాబట్టి.. నేను అలా అనను' అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

2020 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే, తన ఓటమిని అంగీకరించని ట్రంప్.. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఫలితాలను మార్చాలనే ఉద్దేశంతో పలు కీలక రాష్ట్రాల్లో వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. అయితే, తన ఆరోపణలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. మరోవైపు జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకునేందుకు 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. ట్రంపే వారిని రెచ్చగొట్టారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

**న్యూయార్క్‌లో కాల్పుల కలకలం**

అమెరికాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. న్యూయార్క్‌లో కాల్పులు కలకలం రేపాయి. బ్రూక్లిన్ సమీపంలోని కోనీ ఐలాండ్‌లో బాణసంచా ప్రదర్శనను తిలకిస్తున్నవేళ అక్కడి సమూహంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు మైనర్లు సహా ఎనిమిదిమంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 21 ఏళ్ల యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు న్యూయార్క్ పోలీసులు వెల్లడించారు. బాధితులను గుర్తించాల్సి ఉందని, తర్వాతే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఘటనా స్థలంనుంచి ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు జరుగుతోందన్నారు.

# పీవోకేలో ఆందోళనలు ఉధృతం

**పాక్ పోలీస్ కాల్పులు.. ఒకరి మృతి**



పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనకారులు ఆదివారం చేపట్టిన ఆందోళనపై భద్రతాబలగాలు విరుచుకుపడ్డాయి. నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 14మంది గాయపడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో ఈ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా పీవోకేలోని ముజఫరాబాద్, దద్యాల్లో నిరసనకారులు రోడ్డెక్కారు. దద్యాల్-మీర్పూర్ వంతెనపై భారీగా నిరసనకారులు చేరుకోవడంతో పాక్ రేంజర్లు కాల్పులకు దిగారు. ఏకే 47 తుపాకులతో కాల్పులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. నిరసనకారులను చెదరగొట్టడానికి పీవోకే పోలీసులు టియర్ గ్యాస్, షెల్స్ ప్రయోగించారు. ఇక ముజఫరాబాద్‌లోనూ ఆందోళనకారులపై పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. ఎంతమంది గాయపడ్డారనే విషయం తెలియలేదు. ఈ ఘటనలకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. గత కొన్నిరోజులుగా పీవోకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో నిరసనలకు మద్దతిస్తున్న జేఏఏసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. జేఏఏసీకి చెందిన 600మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీవోకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.

ఈ నేపథ్యంలో సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ నిరసనకారులు రోడ్లపైకి వచ్చారు. సంయుక్త అవామీ కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. తమ నాయకులను విడుదల చేయాలని, ఇటీవల పాక్ కాల్పుల్లో మృతిచెందిన వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

# మేమనుకుంటే.. అందర్నీ లేపేసేవాళ్లం

### ఖమేనీ అంత్యక్రియలకు హాజరైనవాళ్లపై ట్రంప్ వ్యాఖ్య



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ అంత్యక్రియల అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల సమయంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని.. కానీ తమతో చర్చలు జరపడానికి ఎవరూ ఉండరనే కారణంతో వారిని వదిలేశామని అన్నారు. ఆ దేశంలోని మిగిలిన నాయకత్వాన్ని నిర్మూలించగలనని.. కానీ అలా చేయాలని తాను అనుకోవట్లేదని పేర్కొన్నారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాదిమంది ఇరానియన్లు కన్నీరు పెట్టుకోవడంపై ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ దేశ ప్రజలు ఖమేనీని ద్వేషిస్తున్నారని ఇంతకాలం తాను అనుకున్నట్టు తెలిపారు. తాను అనుకున్నదే నిజమై ఉండొచ్చని.. అంత్యక్రియల సమయంలో ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉంటారని అన్నారు.

**బాస్ ఎవరో నెతన్యాహుకు తెలుసు..: ట్రంప్**

ఇరాన్ విషయంలో చర్చలు జరపడానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తనతో సమావేశం కావాలని అభ్యర్థించారని ట్రంప్ తెలిపారు. తాను నాటో సదస్సునుంచి వచ్చిన తర్వాత.. వచ్చేవారంలో చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. తామిద్దరం చాలా బాగా కలిసిపోతామన్నారు. కానీ తమలో బాస్ ఎవరో నెతన్యాహుకు తెలుసని తనను తాను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారని.. అమెరికాలో త్వరలో భేటీ కావాలని నిర్ణయించుకున్నారని నెతన్యాహు కార్యాలయం తెలిపింది.

# హార్ముజ్‌లో ఇక సేవా రుసుం

**మిత్ర దేశాలను ప్రత్యేకంగా ట్రీట్ చేస్తాం: ఇరాన్**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో కొత్త టోల్ విధానాన్ని అమలు చేయడానికి ఇరాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మానీ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ తమ ప్రాదేశిక జలాల్లో భాగంగా ఉన్నందున.. జలసంధిలో సేవా రుసుం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఇవి టోల్ కిందకు రావన్నారు. ఈ విషయంపై ఒమన్ చర్చలు జరుపుతున్నామన్నారు. కష్టసమయంలో తమకు సహకారం అందించిన మిత్ర దేశాలకు సేవా రుసుం విషయంలో ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హార్ముజ్‌లో ప్రయాణ భద్రతకు హామీ ఇవ్వడం, నౌకల రాకపోకలను పర్యవేక్షించడం, భారీ సంఖ్యలో నౌకలవల్ల కలిగే పర్యావరణ పరిణామాలను ఎదుర్కోవడం వంటివాటిని ఒమన్ సహకారంతో ఇకపై తాము పర్యవేక్షిస్తామని అబ్దుల్ రెజా వెల్లడించారు. కాగా హార్ముజ్‌లో విధించే సేవా రుసుంపై మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని టెహ్రాన్ యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

హార్ముజ్ భద్రతను ఇకపై ఒమన్‌తో కలిసి తాము చూసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాది పేర్కొన్నారు. ఇతర దేశాలు సైనిక విన్యాసాలు చేపట్టడానికి ఈ జలసంధి రంగస్థలం కాదని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా.. ఒమన్ తీరం వెంబడి ప్రయాణించడానికి ప్రయత్నించిన ఎనిమిది నౌకలను అక్కడి అధికారులు వెనక్కి పంపినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి.



# భారత్ సాయం మరవలేం!

**- గాయాలనుంచి కోలుకుంటున్న వెనెజువెలా**

**- భారత్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రిలో తేరుకుంటున్న క్షతగాత్రులు**

ఇటీవల సంభవించిన జంట భూకంపాలతో కకావికలమైన వెనెజువెలా ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మహా ప్రళయం మిగిల్చిన విషాదంనుంచి తేరుకుంటోంది. తమకు ఆపన్న హస్తం అందించిన భారత్‌కు అక్కడి ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. భారత్ సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జూన్ 24న సంభవించిన జంట భూకంపాలతో వెనెజువెలా చిగురుటాకులా వణికిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు 2,900 మందికి పైగా మృత్యువాత పడగా.. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. భూకంప బాధితులకు మానవతా సాయం అందించేందుకు భారత్ 'ఆపరేషన్ అమిస్తాద్' చేపట్టింది. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలను తీసుకెళ్లి సేవలందించింది. తాజాగా అక్కడి భారత్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఫొటోలు, వీడియోలను విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఘోర ప్రకృతి విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారు, వారి కుటుంబ సభ్యులు భారత్ సాయానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. కఠిన పరిస్థితుల్లో భారత్ వైద్య సిబ్బంది అద్భుత సేవలు అందించారని కొనియాడుతున్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు. కష్టకాలంలో మమ్మల్ని ఆదుకున్నారు. మీ మేలు మర్చిపోలేం" అంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. ఆపరేషన్ అమిస్తాద్‌లో భాగంగా కరాకస్‌లో ఇండియన్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రి ఏర్పాటు చేసి.. రోజంతా వైద్య సేవలు అందిస్తోంది. వెనెజువెలా కష్టకాలంలో ఉన్నప్పుడు భారత సైనిక ఫీల్డ్ ఆస్పత్రి ఆశాదీపంగా నిలుస్తూ, అక్కడి ప్రజల నమ్మకాన్ని పొందింది. మానవతా సాయం, విపత్తు నిర్వహణపట్ల భారత్ నిబద్ధతను ఈ మిషన్ ప్రతిబింబిస్తోంది. ఈ విపత్కర సమయంలో వెనెజువెలా ప్రజలకు అండగా నిలుస్తూ.. వారిని సంరక్షిస్తోంది" అని భారత సైన్యం అదనపు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ (ఏడీజీపీఐ) ఎక్స్‌లో పేర్కొంది.

## ఫెదరర్ రికార్డు బద్దలు కొట్టిన జకోవిచ్..

# వింబుల్డన్‌లో సరికొత్త చరిత్ర

**సఫీయుల్లిన్‌పై హోరాహోరీ విజయం..**

**106 విజయాలతో ఆల్‌టైమ్ నంబర్ వన్‌గా సెర్బియా స్టార్**



లండన్: వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో నొవాక్ జకోవిచ్ మరో సంచలన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన ప్రి-క్వార్టర్ ఫైనల్ (రౌండ్ ఆఫ్ 16) పోరులో రష్యాకు చెందిన రోమన్ సఫీయుల్లిన్‌పై హోరాహోరీగా విజయం సాధించి, పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌కు అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్‌ను 7-6(6), 6-3, 3-6, 6-3 స్కోరుతో నెగ్గిన జకోవిచ్, ఈ విజయంతో వింబుల్డన్ చరిత్రలో అత్యధిక పురుషుల సింగిల్స్ మ్యాచ్ విజయాల రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఈ మేరకు టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న 105 విజయాల రికార్డును అధిగమించి, 106వ విజయంతో ఆల్‌టైమ్ నంబర్ వన్‌గా నిలిచాడు. పురుషులు, మహిళల సింగిల్స్ కలిపి చూస్తే మార్టినా నవ్రతిలోవా (120 విజయాలు) మాత్రమే జకోవిచ్ కంటే ముందున్నారు.

మూడు గంటల 26 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ప్రపంచ 132వ ర్యాంకర్, క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన సఫీయుల్లిన్ నుంచి జకోవిచ్‌కు గట్టి పోటీ ఎదురైంది. తొలి సెట్‌లో వరుసగా రెండుసార్లు సర్వీస్ కోల్పోయిన జకోవిచ్, 2-5తో వెనుకబడ్డాడు. అయితే కీలక తరుణంలో పుంజుకుని టై-బ్రేక్‌లో పట్టు బిగించి తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో మెరుగైన ఆటతీరు కనబరిచిన సెర్బియా స్టార్, మూడో సెట్‌లో మాత్రం కాస్త వెనుకంజలో పడి, తన కెరీర్‌లో సఫీయుల్లిన్ చేతిలో తొలిసారి ఒక సెట్‌ను కోల్పోయాడు. అయితే నాలుగో సెట్‌లో మళ్లీ పట్టు బిగించి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం జకోవిచ్ మాట్లాడుతూ, ప్రత్యర్థి చాలా దృఢంగా, దూకుడుగా ఆడాడని కొనియాడాడు. తొలి సర్వ్‌లోని కచ్చితత్వమే తనను గట్టెక్కించిందని పేర్కొన్నాడు.

ఈ విజయంతో జకోవిచ్ వరుసగా తొమ్మిదో ఏడాది వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఇది అతని కెరీర్‌లో 17వ వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ కాగా, గ్రాండ్‌స్లామ్‌ల మొత్తంలో 66వ క్వార్టర్ ఫైనల్‌గా నమోదైంది. అయితే ఈ విభాగంలో ఫెదరర్ (18 క్వార్టర్ ఫైనల్స్) ఇంకా ముందంజలోనే ఉన్నాడు. వింబుల్డన్‌లో రౌండ్ ఆఫ్ 16 దశలో జకోవిచ్ రికార్డు ఇప్పుడు 17-1గా ఉంది. అతని ఏకైక ఓటమి 2006లో అరంగేట్రం సమయంలో మారియో అన్సిచ్ చేతిలో నమోదైంది.

ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్‌గా నిలిచిన జకోవిచ్, ఈసారి ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక టైటిళ్ల రికార్డు (8)ను సమం చేయాలని గురిపెట్టాడు. అదే జరిగితే, పురుషులు లేదా మహిళల సింగిల్స్ చరిత్రలో 25 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో టెన్నిస్ చరిత్రలో అగ్రస్థానంలో ఉన్న 39 ఏళ్ల జకోవిచ్, వయసు పైబడుతున్నా తన పోరాట పటిమను నిరూపించుకుంటూనే ఉన్నాడు.

క్వార్టర్ ఫైనల్‌లో జకోవిచ్ ముఖాముఖిగా ఫెలిక్స్ ఆగర్-అలియాసిమే లేదా అలెహాండ్రో దేవిడోవిచ్ ఫోకినాతో తలపడనున్నాడు. వీరిద్దరిలో ఎవరు ఎదురైనా జకోవిచ్‌దే పైచేయిగా క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగర్-అలియాసిమేతో గతంలో 2022లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక్కోటి చొప్పున గెలిచి, ఓడిన జకోవిచ్, దేవిడోవిచ్ ఫోకినాపై మాత్రం 5-1తో ఆధిక్యంలో ఉన్నాడు.

ఇక ఓటమి పాలైన సఫీయుల్లిన్ ఈ టోర్నీలో అందరి దృష్టిని ఆకర్షించాడు. క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన అతను, రెండో వారానికి చేరుకునే క్రమంలో ఆండ్రీ రుబ్లేవ్, బోటిక్ వాన్ డి జాండ్‌స్కుల్ప్‌లతో పాటు 24వ సీడ్ జోవావో ఫోన్సెకాను కూడా ఓడించి సత్తా చాటాడు. అయితే జకోవిచ్‌తో జరిగిన మూడు ముఖాముఖి పోరుల్లోనూ (గతంలో రెండుసార్లు, తాజాగా ఇది మూడోసారి) సఫీయుల్లిన్ ఒక్కసారి కూడా గెలవలేకపోయాడు. మ్యాచ్ మధ్యలో తుంటి గాయంతో బాధపడుతూ చికిత్స తీసుకున్నప్పటికీ, చివరిదాకా పోరాడి మూడో సెట్‌ను సొంతం చేసుకున్నాడు.

భారత అభిమానులకు వింబుల్డన్ 2026 మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చూసే వెసులుబాటు ఉంది. తెలుగుతో సహా పలు భాషల్లో వ్యాఖ్యానం అందుబాటులో ఉంది. జకోవిచ్ తన 25వ గ్రాండ్‌స్లామ్ కల నెరవేర్చుకుంటాడా, ఫెదరర్ టైటిళ్ల రికార్డును సమం చేస్తాడా అనేది క్వార్టర్ ఫైనల్ నుంచి తేలనుంది.

# ఫ్యాన్స్ డిమాండ్‌తో నెరవేరిన వైభవ్ కల

**సెలక్టర్లపై సోషల్ మీడియా ఒత్తిడి..**

**ఇంగ్లాండ్‌తో అరంగేట్రం**



ఐపీఎల్లో అదరగొట్టినప్పటికీ ఐర్లాండ్ సిరీస్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంతో టీమ్ ఇండియా మేనేజ్మెంట్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఆటగాళ్లు, అభిమానులు వైభవ్‌కు మద్దతుగా నిలిచి ఇంగ్లాండ్ (ఇంగ్లాండ్ వర్సెస్ ఇండియా) టీ20 సిరీస్‌లో ఆడించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇంగ్లాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో వైభవ్ సూర్యవంశీకి ఆడే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో భారత్ తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డులకెక్కాడు. ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ 10 బంతుల్లో 14 పరుగులు చేసి వెనుదిరిగాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. తన ప్రయాణంలో తనకు మద్దతునిచ్చి, నమ్మకం ఉంచిన అభిమానులు, సహచర ఆటగాళ్లు, సీనియర్లకు ఈ యువ బ్యాటర్ కృతజ్ఞతలు తెలియజేశాడు.

"మీ అందరినుంచి వస్తున్న సందేశాలు చూసి నేను ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. నాకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తూ ప్రేమాభిమానాలు చూపిస్తున్న నా సీనియర్లకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు. నా దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతిసారీ నా జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శనను అందించడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తాను. అందరికీ ధన్యవాదాలు" అని వైభవ్ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చాడు. తన తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేయకపోయినప్పటికీ ఈ వండర్ కిడ్‌పై ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే కాలంలో వైభవ్ మరిన్ని అవకాశాలు అందుకుని భారీ ఇన్నింగ్స్ ఆడతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్ అరంగేట్రం చేసిన వైభవ్.. 37 ఏళ్లుగా సచిన్ తెందుల్కర్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. శనివారం ఇంగ్లాండ్‌తో రెండో టీ20 ఆడేటప్పటికి వైభవ్ వయసు 15 ఏళ్ల 99 రోజులు మాత్రమే. 1989లో సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో తొలి అంతర్జాతీయ మ్యాచ్ (పాకిస్థాన్‌తో టెస్టు) ఆడి రికార్డు నెలకొల్పాడు.

# వాళ్లిద్దరికీ చెడిందా?





- **పృథ్వీ షా, ఆకృతి అగర్వాల్ మధ్య గందరగోళమంటూ స్టోరీలు**
- **ఎంగేజ్‌మెంట్ ఫొటోలు డిలీట్.. అన్‌ఫాలో వ్యవహారంతో ఊహాగానాలు**

ముంబై: భారత క్రికెటర్ పృథ్వీ షా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, నటి ఆకృతి అగర్వాల్ ఎంగేజ్‌మెంట్ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది మార్చి 8న ఘనంగా నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నట్టు నెటిజన్లు గుర్తించారు. దీనికితోడు ఆకృతి తన ఇన్‌స్టా స్టోరీలో పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. అందులో పేరు ప్రస్తావించకుండా, "నన్ను చాలాసార్లు మోసం చేశాడు. అయినా మౌనంగా ఉన్నాను. జీవితంలో ఒక అడుగు ముందుకు వేసిన తర్వాత కూడా ఇలా జరగడం నమ్మలేకపోతున్నాను" అనే అర్థం వచ్చేలా రాసుకొచ్చినట్టు స్క్రీన్‌షాట్లు సూచిస్తున్నాయి. ఈ స్టోరీ కొన్ని గంటల్లోనే డిలీట్ అయినట్టు సమాచారం. అంతటితో ఆగకుండా, శనివారం (జూలై 5) ఆమె మరో స్టోరీ పెట్టి, "వాళ్లు ఎప్పుడూ అబద్ధమే చెబుతారు" అని రాశారు. దీంతో పాటు నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలను కూడా ఆమె తన ఖాతానుంచి తొలగించినట్టు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయమై పృథ్వీ షాగానీ, ఆకృతి అగర్వాల్‌గానీ ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో వీరిద్దరి బంధంపై సందిగ్ధత నెలకొంది.

ఇక ఆకృతి అగర్వాల్ విషయానికొస్తే, ఆమె లక్నోలో జన్మించి ముంబైలో స్థిరపడిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్. తెలుగు చిత్రం "త్రిముఖ"తో నటిగా పరిచయమైన ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది ఫాలోవర్లు ఉన్నారు. టెస్ట్ అరంగేట్రంలోనే సెంచరీ సాధించి సంచలనం సృష్టించిన పృథ్వీ షా, గత కొంతకాలంగా టీమ్ ఇండియాలోకి తిరిగి రావడానికి ప్రయత్నిస్తున్నారు.

# బిష్ణోయ్ చెత్త రికార్డు.. ఇండియా ఓటమి

**- ఒకే ఓవర్‌లో 3 నోబాల్స్‌తో సరికొత్త అపకీర్తి..**

**- అటు అక్షర్ పటేల్ సత్తా, టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి**



ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా స్పిన్నర్ రవి బిష్ణోయ్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. 4 ఓవర్లు వేసి ఒక్క వికెట్టూ పడగొట్టకుండా 60 పరుగులు ఇచ్చాడు. లక్ష్యచేదనలో ఇంగ్లాండ్ జట్టుకు చివరి నాలుగు ఓవర్లలో 49 పరుగులు అవసరమయ్యాయి. 17 ఓవర్ వేసిన బిష్ణోయ్ 29 పరుగులు ఇవ్వడంతో భారత్ గెలుపు అవకాశాలు సన్నగిల్లాయి. ఆ ఓవర్లో టీమ్ ఇండియా స్పిన్నర్ రెండు నోబాల్స్ వేయగా.. ఫ్రీ హిట్లను జాకబ్ బెతెల్ సిక్సర్లుగా మలిచాడు. ఇదే మ్యాచ్‌లో అంతకుముందు బిష్ణోయ్ మరో నోబాల్ వేశాడు. దీంతో ఒక అంతర్జాతీయ టీ20లో మూడు నోబాల్స్ వేసిన ఐసీసీ పూర్తి సభ్యదేశానికి చెందిన తొలి బౌలర్‌గా రవి బిష్ణోయ్ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు.

అంతేకాకుండా టీ20ల్లో ఒకే ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన మూడో భారత బౌలర్‌గా బిష్ణోయ్ నిలిచాడు. 2020లో న్యూజిలాండ్‌పై శివమ్ దూబె 34 రన్స్, 2016లో వెస్టిండీస్‌పై స్టువర్ట్ బిన్నీ ఒకే ఓవర్లో 32 పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్ నుంచి బిష్ణోయ్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరముందని మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. "రవి బిష్ణోయ్ చివర్లో పుంజుకుంటాడని భావించి బౌలింగ్ చేయించాం. కానీ 17వ ఓవర్లో ఎక్కువ రన్స్ రావడం మాకు కాస్త ఇబ్బందికరంగా మారింది. ఏది ఏమైనా కచ్చితంగా అతడు ఆ అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవాలి" అని శ్రేయస్ పేర్కొన్నాడు.

### అక్షర్ పటేల్ ఏ100

ఇంగ్లాండ్ రెండో టీ20లో భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి కీలకమైన హ్యారీ బ్రూక్ వికెట్ పడగొట్టాడు. దీంతో టీ20ల్లో అక్షర్ అంతర్జాతీయ 100 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి భారత స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా 100 వికెట్ల మైలురాయి అందుకున్న నాలుగో భారత క్రికెటర్‌గా నిలిచాడు. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ (134 వికెట్లు), జస్ప్రీత్ బుమ్రా (121), హార్దిక్ పాండ్య (114) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

# “ఆ నినాదం ఆనందమే.. కానీ, ఆ ఉద్దేశం లేదు”



అక్కినేని అఖిల్ తాజా ప్రాజెక్టు 'లెనిన్' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్‌లో బిజీగావున్న అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం, కెరీర్‌పై ఆలోచనలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో “అయ్యగారే నెం.1” అనే నినాదంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో “అయ్యగారే నెం.1' అంటూ ఓ అభిమాని చేసిన వ్యాఖ్యకు ఆనందం వ్యక్తం చేస్తూ.. తనపై అభిమాని చూపిన ప్రేమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. నిజం చెప్పాలంటే 'నంబర్ వన్' కావాలనే లక్ష్యం నాకు లేదు.

నంబర్ వన్ అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకరికి నంబర్ వన్ అనిపించే వ్యక్తి, మరొకరికి కాకపోవచ్చు. అందుకే ఆ పోలికల గురించి ఎక్కువ ఆలోచించను” అని అఖిల్ స్పష్టం చేశారు. అయితే, తనపై ఫ్యాన్స్ ప్రేమ మరింత బాధ్యత పెంచుతుందని వారి అంచనాలను అందుకోవాలనే బాధ్యత తనపై ఉంటుందని అంగీకరించారు. ఫ్యాన్స్ ప్రేమ, ఉత్సాహం మరింత కష్టపడేలా ప్రేరణనిస్తాయని, వారిని ఎప్పుడూ నిరాశపరచకూడదనేదే నా ప్రయత్నమని అన్నారు. తెలుగు సినీ అభిమానుల్లో కొన్ని ప్రత్యేక నినాదాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని చెబుతూ, “జై బాలయ్య” తరహాలో “అయ్యగారే నెం.1” కూడా తనతో ఎప్పటికీ ముడిపడి ఉండిపోతుందని అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. తన గత చిత్రాలైన 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' గురించి అఖిల్ మాట్లాడుతూ.. “ఆ సినిమాల్లో తాను పోషించిన పాత్రలు మహిళలను గౌరవించే యువకులుగా ఉండటం ఎంతో నచ్చిం”దన్నారు. ముఖ్యంగా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రంలోని హర్ష పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రలో ఉన్న విలువలు ప్రతి అమ్మాయి కోరుకునే లక్షణాలు. అలాంటి పాత్ర చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది అని అఖిల్ వ్యాఖ్యానించారు.

## సంక్రాంతి టార్గెట్‌గా ప్లాన్ చేశారా!



హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'జార్జ్ క్రిష్'పై ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభానికి సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకొచ్చింది. నిర్మాత అనిల్ సుంకర స్వయంగా సినిమా తొలి షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించడంతో ఈ ప్రాజెక్ట్ మరోసారి వార్తల్లో నిలిచింది. నిర్మాత అనిల్ సుంకర తెలిపిన వివరాల ప్రకారం, 'జార్జ్ క్రిష్' సినిమా తొలి షెడ్యూల్‌ను ఆగస్టు రెండోవారంనుంచి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు తుదిదశలో ఉండగా, షూటింగ్ కోసం చిత్రబృందం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. మొదటి షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు సమాచారం. హీరోయిన్ ఎంపికపై గత కొద్ది రోజులుగా అనేక పేర్లు వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం యువ నటి భాగ్యశ్రీ బోర్సేను హీరోయిన్‌గా ఖరారు చేసినట్టు తెలుస్తోంది. చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఆమె ఎంపిక దాదాపు ఖాయమైనట్టు సినీ వర్గాల టాక్. రెండో షెడ్యూల్‌లో శర్వానంద్, భాగ్యశ్రీ బోర్సేపై కీలకమైన ప్రేమకథ సన్నివేశాలను చిత్రీకరిస్తారన్న టాక్ వినిపిస్తోంది. సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం వేగంగా పనులు చేస్తోంది. టాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీను వైట్ల 'విశ్వం' ఫ్లాప్ తరువాత.. బలమైన కంబ్యాక్ కోసం 'జార్జి క్రిష్'ను కసితో చేయనున్నారన్న కథనాలు వినిపిస్తుండటం తెలిసిందే. తెలియని వయసులో హీరో చేసిన చిన్న పొరపాటు అతని జీవితాన్ని ఎలా మార్చేసింది? ఆ నిర్ణయం తర్వాత అతను ఎదుర్కొన్న పరిణామాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ తిరుగుతుందని అంటున్నారు.

## లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ రొమాన్స్?

విజయ్ దేవరకొండ, రవికిరణ్ కోలా కాంబో ప్రాజెక్టే 'రౌడీ జనార్దన'. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్టు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ 'లైగర్' సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేదా అనేది అధికారిక ప్రకటనతోనే తెలియాలి. సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్‌మ్యాన్ రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట.



## ఓటీటీలోకి సింగ్ గీతం ..



ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన 61వ చిత్రం 'సింగ్ గీతం' థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన తర్వాత ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. సంగీతం, ఫాంటసీ, భావోద్వేగాలను వినూత్నంగా మేళవించిన చిత్రం త్వరలోనే నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ ప్రీమియర్ కానుంది. నిర్మాత నాగ్ అశ్విన్ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, జూలై 9 నుంచి 'సింగ్ గీతం' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఓటీటీ విడుదల సందర్భంగా ప్రేక్షకులకు మరింత చేరువయ్యేలా తెలుగు, తమిళంతోపాటు కన్నడ, మలయాళం భాషల్లోనూ తీసుకొస్తున్నారు. దీంతో దక్షిణాది నాలుగు ప్రధాన భాషల్లో ఒకేసారి సినిమా ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్ మరో ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. థియేటర్లలో విడుదలైన వెర్షన్‌తో పోలిస్తే ఓటీటీ వెర్షన్‌లో కొన్ని సాంకేతిక మెరుగుదల చేసినట్టు తెలిపారు. ఆడియో, విజువల్ ప్రెజెంటేషన్‌తో పాటు కొన్ని సన్నివేశాల్లో కూడా స్వల్ప మార్పులు చేసి, ఇంట్లో కూర్చుని చూసే ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతిని అందించేలా సినిమా సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. 'సింగ్ గీతం'లో చిన్న గ్రామంలో జరిగే మాయా సంఘటన తర్వాత ప్రజల జీవితాలు పూర్తిగా మారిపోతాయి. సంతోషం, బాధ, కోపం, ప్రేమ, ఆశ్చర్యం... ఇలా ప్రతి భావాన్నీ సంగీతంతో వ్యక్తపరిచే ఆ గ్రామం చుట్టూ కథ సాగుతుంది. చిత్రంలో అయాన్, అహిల్యా బమ్రూ ప్రధాన పాత్రల్లో నటించారు. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించారు.

## 'ఫౌజీ' విజువల్స్ చూసి మైండ్ బ్లాక్




ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో రానున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా 'ఫౌజీ'పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హను రాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ పాన్–ఇండియా విజువల్ వండర్‌ను నిర్మిస్తోంది. వచ్చే వింటర్ కానుకగా డిసెంబర్‌లో సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా సినిమాకు సంబంధించి ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంచుకున్న క్రేజీ అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ చూపించిన 'ఫౌజీ' రషెస్ చూశాక మైండ్ బ్లాక్ అయిందని పేర్కొన్నారు. చిత్ర యూనిట్ సినిమాను మనం ఊహించని రేంజ్‌లో, ఒక సరికొత్త హాలీవుడ్ లెవెల్‌లో తెరకెక్కిస్తోందని ప్రశంసలు కురిపించారు. నాగవంశీ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్‌గా మారడంతో, ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే సినిమా ప్రమోషన్స్ షురూ చేయాలని, అఫీషియల్ టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలంటూ ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రంతో సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. అలాగే బాలీవుడ్ దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, సీనియర్ నటి జయప్రద, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె. ఆచార్‌వంటి భారీ తారాగణం సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'గాడ్ ఆఫ్ వార్'కి కొత్త సమస్య?

జూనియర్ ఎన్టీఆర్‌తో దర్శకుడు త్రివిక్రమ్ చేయాల్సిన నెక్స్ట్ లెవెల్ ప్రాజెక్ట్ “గాడ్ ఆఫ్ వార్”. ఈ భారీ స్కేల్ డ్రామా త్వరలోనే మొదలవుతుందన్న టాక్ ఉంది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ ఎట్టకేలకి అనౌన్స్ కావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే, సినిమా ఇంకా మొదలుకాకుండా కొన్ని ఊహించని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మొదటిగా సినిమా అనౌన్స్ చేసినపుడే తమిళ ఆడియెన్స్ మా 'మురుగన్' ఉత్తర భారదేశానికి చెందినవాడు కాదంటూ స్టార్ట్ చేశారు. ఇక ఇదిప్పుడు రాజకీయ కోణంలోకి కూడా మారిపోయింది. తమిళ నాట ప్రముఖ రాజకీయ పార్టీ ఎన్టీకే అధినేత సీమన్ వార్న్ చేయడం కొత్త చర్చకి దారి తీసింది. చిత్రీకరణకు ముందే తమ నేలకి చెందిన ఆరాధ్య దైవం కుమారస్వామి ఉత్తరాన జన్మించాడన్న కథనాన్ని చిత్ర నిర్మాతలు వెంటనే విడిచిపెట్టాలని, లేకపోతే చిత్ర బృందం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వార్న్ చేయడం షాకింగ్‌గా మారింది. అయితే ఇటువంటి సబ్జెక్టులు పురాణాలపరంగా త్రివిక్రమ్‌కి ఎంతో అవగాహన ఉంది. ఎలాంటి రీసెర్చ్ లేకుండా తాను ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి దిగారనుకుంటే అవివేకమే. సో ఈ కాంట్రవర్సీలు అన్నిటికీ చెక్ చెబుతూ మేకర్స్ ఏమన్నా క్లారిటీ ఇస్తారా? లేదా? అనేది చూడాలి.

